శ్రీకళా గౌతమి

తెలుగు భాషాభివృద్ధి మాసపత్రిక

వ్యవస్థాపక సంపాదకులు

డా. బులుసు వేంకటసత్యనారాయణమూర్తి

సంపుటి 10 – సంచిక 2 జూలై 2019 వెల రూ 15/





జన్మనా జాయతే శూద్రః – సంస్కారాత్ ద్విజ ఉచ్యతే!
విద్యయా యాతి విప్రత్వమ్ – బ్రహ్మ జ్ఞానాత్ బ్రాహ్మణః!!

పుట్టుకచేత మనుష్యులు సామాన్యులుగానే (శూద్రులు గానే) పుడతారు. సంస్కారంవల్ల రెండవ జన్మను (ద్విజుడు) పొందు తారు. విద్యవల్ల (జ్ఞానం) విప్రత్వం సాధించుకుంటారు. వారికే బ్రహ్మ జ్ఞానం వల్ల బ్రాహ్మణత్వం సిద్ధిస్తుంది. దీనినిబట్టి ఈనాటి మన కులవ్యవస్థకు మనువు మూలము, కారణము కాదు. మనువు చెప్పింది మనుషుల్లోని నాలుగు రకాలను మాత్రమే. మన దేశంలో నేడు మూడు వేలకు పైగా కులాలు ఉన్నాయి. అవి మనువు చెప్పినవి కానే కావు.

నేర్చుకోవాలనే ఆసక్తి కలవారికోసం ఈ పాఠం

పదనిష్పాదన కళ

– తాడేపల్లి లలితాబాలసుబ్రహ్మణ్యం

ఆంగ్లపదజాలపు వెల్లువ చేసిన/చేస్తున్న నష్టం

పదాల్ని ఏపదానికి ఆ పదం వేర్వేరుగా దిగుమతి చేసుకో <ŠZ×¿±+Ü¿£dÿeTÖsÄT (Stand-alone entities)గా చూడటం పొరపాటు. నిజంగా అవి ఐకాంతిక స్వమూర్తులే అయితే నిరభ్యంతరంగా కావలసినన్ని విదేశీపదాల్ని దిగుమతి చేసుకోవచ్చు. బస్సు, సైకిలు, రైలు మాదిరి! కానీ ఎక్కువ సందర్భాల్లో ప్రతి పదానికీ ఒక ధాతువు (మూలపదం), ఒక ఉపసర్గ, ప్రత్యయం, దాన్నుంచి నిష్పన్నమైన పదాలు మొదలైన విస్తార 'పద కుటుంబం' ఒకటుంటుంది. దాన్ని తరతరాల వ్యాకరణ సంప్రదాయాల ఆధారంగా నిర్మిస్తారు. విదేశీ పదనిర్మాణాలు వారి వ్యాకరణ సంప్రదాయాల ననుసరించి ఉంటాయి. వారికి అవి తెలుసుకనుక అంతకు ముందునుంచి తమ భాషలో ఉన్న పదాలనుంచి సరికొత్త పదాలు (derivatives), ఆ పదాలనుంచి సరికొత్త పదాలు, ఆ సరికొత్త పదాలనుంచి ఇంకా కొత్తపదాలు అలా అనంతంగా పదకల్పన చేసుకుంటూ వెళ్లగలుగుతారు. అంటే వాళ్ళు తమ భాషలో తదుపరి నిష్పాదన (further coinage) కూడా చెయ్యగలరు. అది వాళ్ళ భాష కనుక! ఇంగ్లీషులో ఉన్న పదాలు అచ్చమైన ఇంగ్లీషు పదాలే అయితే మనం ఇంగ్లీషు ఒక్కటి నేర్చుకుంటే సరిపోతుంది. కానీ దురదృష్ట వశాత్తు అలా లేదు. ఆ భాషలో 70 శాతం లాటిన్, గ్రీకు పదాలు. ముఖ్యంగా శాస్త్ర సాంకేతిక పరిభావనల(scientific and technological concepts)కి సంబంధించి 90 శాతం అవే.

మనం ఇంగ్లీషులోని సాంకేతిక పదాల్ని దిగుమతి చేసుకోగలమే తప్ప ఆ పదాల్ని వారిలా వికరించి (modify) తదుపరి నిష్పాదన (further coinage)చేయగలమా అని ఆలోచించాలి. అలా మనం చెయ్యలేమనేది సుస్పష్టం. మనలో అత్యంత మేధావులూ, విద్యావంతులూ అయినవారుకూడా చెయ్యజాలరు. మనకి ఆంగ్ల వ్యాకరణం ఒక్కటే వచ్చు. గ్రీకు, లాటిన్ వ్యాకరణాలు రావు. అవి ఇంగ్లీషు మేధావులకే వచ్చు. శాస్త్ర, సాంకేతిక, వైద్యశాస్త్ర పరిభాషలన్నీ గ్రీకు, లాటిన్‌లతో నిండిపోయి ఉన్నాయి. ఆ శాస్త్రాల్లో మనం పరిశోధనకి దిగితే, అక్కడ మనం కనుగొనబోయే కొత్త విషయాలకే పేరుపెట్టడంకోసం, తదుపరి నిష్పాదనకోసం తెల్లవారి మోహాలవైపు చకోరపక్షుల్లా చూడడం తప్ప మనమేమీ చేయలేం. కనుక ఆ భాషాపదాలమీద అంతగా ఆధారపడినప్పుడు అది మనకి ఒక అంగవైకల్యంగా, పరాశ్రయంగా పరిణమిస్తుంది. ఆ విదేశీపదాలను దాటి మన పరిభావనలు (concepts) ఎదిగినప్పుడు ఆ విదేశీభాషలో ఆ భావనలకి వ్యక్తీకరణలు(expressions) లభించకా, ఆ వ్యక్తీకరణలు చెయ్యడానికి మనకు స్వేచ్ఛ లేక గ్రీక్, లాటిన్ వ్యాకరణ సంప్రదాయాల పరిజ్ఞాన లోపంవల్ల అది సాధ్యపడక మన మెదళ్ళు స్తంభిస్తాయి. ఇక్కడ సృజనాత్మకత ఇంగ్లీషువాళ్ళ చేతిలో బందీగా మారిపోతుందనీ, అది వారి పదాలతోపాటు మనదాకా ప్రవహించదనీ గ్రహించాలి.

దీనికి పరిష్కారం ఏమిటి? ఆంగ్లమాధ్యమ పాఠశాలల్లో ఇకపైన ప్రతివారికి ఇంగ్లీషుతోపాటు గ్రీకు, లాటిన్ కూడా నేర్పించడం మొదలుపెడదామా? ఇది హాస్యాస్పదం కాదా? ఎందుకంటే ఎవరో కొందరు మేధావులు తప్ప అచ్చమైన ఇంగ్లీషువారే వాటినిప్పుడు నేర్చుకోవడంలేదు. పాపం, ఎన్నని నేర్చుకుంటారు పిల్లలు బడిలో. భాషనుంచి భౌతికశాస్త్రం వరకు, లైంగిక విద్యనుండి యోగా వరకు వాళ్ళ మెదళ్ళను చితక్కొడుతున్నారు ఇప్పటికే.

దీనికి అసలైన పరిష్కారం ఉంది. మనం ఇంకా ఇంకా విదేశీపదాల రొంపిలోనే, రొచ్చులోనే పీకలదాకా దిగబడ్డంలో కాదు, మన వ్యాకరణ సంప్రదాయాల్నే మనం కూలంకషంగా నేర్చుకోవడంలో, మరుగునపడ్డ దేశీపదాల్ని నూతన జవసత్వాలతో పునరుద్ధరించడంలో, మన దేశీపదనిర్మాణాల్ని సక్రమంగా అవగాహనచేసుకుని కొత్తపదాల కల్పనకి ఆసూత్రాల్ని వినియోగించుకోవడంలో అప్పుడు, ఆంగ్లేయులకు తమ భాషలో తదుపరి నిష్పాదన (further coinage) ఎలా సాధ్యమవుతున్నదో, మనవారికి మనభాషలో అది అలా సాధ్యమవుతుంది.

కాని, మనమేం చేస్తున్నాం? మనం ఇదేదీ చెయ్యకుండా భాషాపరంగా ఒక సోమరి మార్గాన్ని ఎంచుకున్నాం. అదేమిటంటే పదాల్ని ఇంగ్లీషునుంచి అనంతంగా యథాతథంగ దించుకోవడం, దించుకోవడం. ఈ దించుకోవడానికి అంతులేదు. ఎదుకంటే మన భావదారిద్ర్యానికి అంతులేదు. దీనివల్ల మన మేధారోగ్యానికి జరిగిన నష్టం గురించి ఎక్కువమందికి అవగాహన లేదు. మనకి పదాలతోపాటు భావాలుకూడా పుట్టడం మానేశాయి. దానిక్కూడా ఆంగ్లేయుల మోహాలకేసి చూస్తున్నాం. ఏ పరిశోధనైనా వారే చెయ్యాలి. వారే అన్నింటికీ పేర్లు పెట్టాలి. ఆ పేర్లనుంచి ఉద్భవించే కొత్త భావాలకి కూడా వారే పేర్లు పెట్టాలి. మనం పేర్లు పెడితే అది సరైన ఇంగ్లీషు కాదు. మన ఆంగ్లపద కల్పనలు హాస్యాస్పదం. యు.ఎస్‌లోనూ, ఇంగ్లాండులోనూ, ఆస్ట్రేలియాలోను దేనికి ఏమంటారో, ఎలా పలుకుతారో తెలుసుకుని మనమూ అదే చేయాలి. ఇదీ మన పరిస్థితి.

అంతిమ పిండితార్థం మన భాషలతో పదాల్లోగాని, వ్యాకరణంలోగాని, వాక్యనిర్మాణంలోగాని, వాడుకలోగాని ఏవిధమైన పోలికలేని భాషలనుంచి పదాల్ని అదేపనిగా అప్పు తెచ్చుకోవడం వలన మనలో భాషాపరంగానే కాక భావపరంగా కూడా స్వకీయతా, సృజనాత్మకశక్తి నశించిపోతాయి. అంతిమంగా మనభాషే నశిస్తుంది. ఎందుకంటే ఆ భాషవారు మనకు నేర్పినదాన్ని మించి ఆ భాషలో మనం ముందుకు వెళ్ళలేం. మన అభిదర్శనం (perception) ఆ భాషాపదాలచేత అలా పరిమితం కావించబడుతుంది. ఏభాషనైతే ఎంతకాలంపాటు అభ్యసించినా, దాని ప్రయోగంమీదా, Further coinage మీదా మనకి అధికారం ఇవ్వబడదో అటువంటి భాషని పదాలకోసం దేవురించడం కేవలం వృథాప్రయాస.

శ్రీకళా **గౌతమి**

తెలుగు భాషాభివృద్ధి మాసపత్రిక

వ్యవస్థాపక సంపాదకులు

డా॥ బులుసు వేంకట సత్యనారాయణ మూర్తి

facebook/kalagowtami - kalagowtami.wordpress.com

సంపుటి 10 - సంచిక 2 జూలై 2019 వెల రూ. 15/-

శ్రీకళాగౌతమి పత్రిక జీవిత సభ్యత్వం: రూ. 1,500/- సం॥ చందా రూ. 180/-

ఆన్‌లైన్ అకౌంట్ నంబరు - లక్ష్మీవిలాస్‌బ్యాంక్ - 0605301000011495

IFSC Code : LAVB 0000605

పాఠకులు చందాలు, రచనలు పంపించాల్సిన చిరునామా :

సంపాదకులు, శ్రీకళాగౌతమి,
102, మూన్ లైట్స్, జె.యన్.రోడ్, మోడల్ కోలనీ,
రాజమహేంద్రవరం-3 పిలుపు : 9866290025

410, సి బ్లాక్, గ్రీన్ హిల్స్ మెగాసిటీ,
పి.జె.ఆర్.రోడ్, చందానగర్, హైదరాబాద్-50
bulusuvsmurty@gmail.com

డిటిపి : లలిత గ్రాఫిక్స్ - 98857 00220
ముద్రణ : సుధా ఆఫ్‌సెట్ - 94403 72046

విచ్ఛిన్నమవుతున్న వివాహవ్యవస్థ

భారతదేశం సనాతన, సత్సంప్రదాయాలకు నిలయమని గర్వంగా చెప్పుకుంటాం. దేశంలో వేల సంవత్సరాలుగా దృఢమైన, పటిష్టమైన వైవాహిక వ్యవస్థ పరిఢవిల్లుతూ యావత్ ప్రపంచానికే తలమానికంగా నిలిచింది. అనాదిగా వేదశాస్త్రాలద్వారా నిర్వహింప బడుతున్న ఈ వైవాహిక వ్యవస్థను లోకానికి ఆదర్శంగా అనుసరి స్తున్నాము. ప్రపంచమంతా స్త్రీపురుషుల సంబంధాలను కేవలం బాహ్య ఆకర్షణలుగా, శారీరక అవసరాలకోసం ఏర్పాటు చేసుకొన్న తాత్కాలిక సంబంధంగా చూస్తుంటే మన దేశంలో మాత్రం ఒకరికి ఒకరు, ఒకరిలో ఒకరంటూ అర్ధనారీశ్వర తత్త్వాన్ని ప్రకటిస్తున్నాము.

అయితే మారుతున్న కాలం, ఆధునిక పోకడలు, ప్రపంచీ కరణ, పాశ్చాత్య ప్రభావం కారణంగా క్రమక్రమంగా మన దేశంలో కూడా వైవాహికవ్యవస్థ బీటలుపడుతోంది. నిన్నటితరం మన వైవాహిక వ్యవస్థ ప్రాశస్త్యాన్ని తర్వాతి తరాలకు అందించక పోవడం, స్త్రీపురుష సంబంధాలయొక్క ఔన్నత్యం, పవిత్రత నేటితరానికి తెలియక పోవడం, మీడియా, వేగంగా విస్తరిస్తున్న అంతర్జాలప్రభావం, పాఠశాల స్థాయినుండీ మన వేదవిజ్ఞానశాస్త్రం, పురాణాలు, ఇతి హాసాలు బాలబాలికలకు అందకపోవడం, నైతికవిలువలు, ప్రేమాను రాగాలు, మానవసంబంధాలు క్షీణించిపోవడం ఇత్యాది కారణాలు అతి పవిత్రమైన మన వైవాహికవ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయి.

1950 ప్రాంతంలో ఏర్పడిన హిందూ వివాహచట్టం, 1976లో భారత ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు విడాకుల మంజూరు కఠినతరం చేసినా దేశవ్యాప్తంగా విడాకుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ విషయమై గత డిసెంబరులో జాతీయ మహిళా సాధికార సంస్థ విడుదల చేసిన అధ్యయన నివేదికలో పలు ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి.

నేడు దేశంలో 14 లక్షలమంది స్త్రీపురుషులు విడాకులు తీసుకుని వేర్వేరు జీవితాలు గడుపుతున్నారు. వివాహితులలో ఈ సంఖ్య 0.24 శాతం. మొత్తం దేశజనాభాలో 0.14 శాతంగా ఉంది. 2010-15 మధ్య కాలంలో విడాకులు తీసుకున్నవారి సంఖ్య గతకాలంతో పోలిస్తే 18 శాతం పెరిగింది. విడాకులు తీసుకోకుండా విడిపోయినవారి సంఖ్య 52 లక్షలుగా ఉంది. ఇందులో 12 శాతం పునర్వివాహం చేసుకోగా, 14 శాతం సహజీవనం చేస్తున్నారు. ఈ సంఖ్య భవిష్యత్తులో మరింత పెరుగుతుందని సామాజిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

విడాకులు కోరుతున్నవారిలో అధికశాతం మహిళలు, అందులోను సాఫ్ట్‌వేర్‌లో పనిచేస్తున్నవారు అధికులవడం గమనార్హం. అపరిమితమైన స్వేచ్ఛ, న్యాయవ్యవస్థ, ఫ్యామిలీ కోర్టులు, రెచ్చగొట్టే లాయర్లు, టి.వి.సీరియళ్ళు, సెల్‌ఫోన్లు, ఉమ్మడికుటుంబవ్యవస్థ లేకపోవడం ఈ దుర్దశకు కారణంగ చెప్పుకోవచ్చు. ముఖ్యంగా పెళ్ళి చేశాకకూడా పిల్ల విషయంలో అతిజాగ్రత్త తీసుకుంటూ నిమిష నిమిషానికి (సెల్‌ఫోన్ భాషణలో) వాళ్ళ కాపురంలో వేలుపెడుతున్న తల్లిదండ్రులే కారణమేమో కూడా ఆలోచించాలి.

తెలుగు భాష

పూతరేకు లరిసె పూర్ణాలు బొబ్బట్లు
కాకినాడ కాజ కజ్జికాయ
బాదుషాలు జాంగ్రి పాయసమ్ములకన్న
తీయనైన భాష తెలుగు భాష!
మిసిమి బంగినపల్లి మామిడుల రుచులు
తాటిముంజలు మేటి సీతాఫలాలు
మెరయు చక్కెరకేళి మాధురులకన్న
తీయనైనది నా భాష తెలుగు భాష!
పెసరపిండిపైన ప్రియమగు నల్లంబు
దాని పైన మిర్చి దద్దరిల్ల
జీలకర్ర తోడ చేర్చిన నుప్మాకు
సాటి తెలుగు భాష మేటి భాష!
స్వర్గమందు దొరకు చప్పని అమృతము
తాగలేక సురులు ధరణి లోన
ఆంధ్రదేశ మందు ఆవిర్భవింతురు
ఆవకాయ కొరకు అంగలార్చి!
కూర్మితోడ తెచ్చి గోంగూర యాకులు
రుబ్బి నూనె మిర్చి ఇంపు తోడ
కార మింగువలను కలగల్పి తినునట్టి
ఘనుడు తెలుగు వాడె కాక యొరులె?
ఆటవెలది యనిన అభిమాన మెక్కువ
తేటగీతి యనిని తియ్యదనము
సీస పద్య మనిన చిత్తమ్ము రంజిల్లు
కంద పద్య మెంత సుందరమ్ము

నేనెవరు?

– శింగరాజు

నడతలోన నేను రాముడ గాను
గోపికల మురియచేయ గోపాలుడ గాను
బలములోన నేను కపిరాజు గాను
కలముతోడ నడువ కవిని గాను
నాగలి చాలు తోల చేత గాదు
తుపాకీ తాకలేని పిరికి వాడ
తెలివి లేదు రాజకీయము చేయ
మాత కడుపున జననము
ఎచటకో ఎరుకలేని పయనము
తరచి తరచి చూచి తెలియరాక
అవనిమాతను అడిగాను తెలుపమని
'తెలుగు నేల నీది – తెలుగు మాత నీది
తెలుగు చదువు నీవు – ఇతరులకు నేరుపు నీవు
నిను కనిన పుడమికి – వెలుగు పరచు చాలు'
అని పలికినది మాత–తొలగినది మదిలోనిమాయ
ఎరికయినది నాకు నడక–తెలుగునుకాపాడుకొన
కదిలె నా పాదము చకచక

నేనెవరు?

– డా. జనపాల

ప్రపంచీకరణతో ఒకటైన పుడమి
ఒకరికి ఒకరు దూరమయిన జనపదులు
సాటివారిపై పరిక్రమించు రాజకీయం
మంచితనాల నీడన చెడ్డతనం
ఏ తపనలో బయటపెడుతుందో తన రూపం
నిన్నటి అమాత్యుల చాతుర్యం అర్థమయినా
నేటి రాజతంత్రం పట్టుబడదు
రంగుమారు మంత్రాంగాన్ని గుర్తించలేము
విలువలు కోల్పోయిన మానవ మేలకములో
విలంబిని పుత్తించి వికారి నయ్యాను
తొలి చినుకుల మొలకెత్తు విత్తుకు
జిడ్డువారిన అవనిలో చోటు లేదని తెలియదు
ప్రాణికోటిని అక్కున చేర్చుకొనే ప్రకృతి (జీవము)
కలంకపు కోరలలో చిందఱ వందఱయింది
పట్టణీకరణతో పల్లెజీవం బొక్కిపోయింది
నేలను నమ్మిన కమతకారులు
మను పీనుగులుగా మిగిలిపోయారు

వేణుగోపాలశతకంలోని ఈ పద్యం చూడండి –

తండ్రి మధ్వాచారి, తనయు డారాధ్యుండు
తల్లి రామాన్జ మతస్థురాలు
తనది కూచి మతము, తమ్ముడు బౌద్ధుండు
సర్వేశ్వర మతంబు షడ్రకునిది
ఆలు కోమటిజాతి, దక్క జంగమురాలు
బావగారిది లింగబలిజ కులము
ఆడుబిడ్డ సుతారి, అల్లుడు పింజారి
మఱదలు కోడలు మారువాడి
కలియుగంబున వర్ణసంకరులు ప్రబలి
యుత్తమ కులంబు లొకమూల కొత్తిగిల్లె
మదరిపు విపాల! మునిజన హృదయలోల!
వేణు గోపాల ! భక్త సంత్రాణ శీల !

దీనికి దాశరథిగారి పేరడీ చూద్దాం –

తండ్రి కాంగ్రెసువాది, తల్లి దేశమువాది
తనయుడు మార్క్సిస్ట్ తత్త్వవేత్త
కూతురు బీజెపి కోసము పోరాడు
అల్లుడు జనతాను అనుసరించు
నిన్నటి జాతీయనేత నేడు విజాతి
సిద్ధాంతములు ప్రవచించసాగు
మొన్నటి ప్రాంతీయమూర్తి ఈ రోజున
అఖిలభారతమని అలమటించు
ఓట్లకొరకయి యెన్నియో పాట్లు పడిరి
నోట్ల కట్టలు చూపి సంతోష పెట్టి
ఎన్ని చేసినగాని ఓట్లిచ్చువాడు
తమకు తోచిన దారినే తరలినారు

కార్పొరేట్ విద్య

– నీలోత్పలకవి యార్లగడ్డ మోహనరావు, 9848071784

ప్రైవేటు కళాశాలలు తామరతంపరగా పెరిగిపోయాయి
విద్యార్థులు వేలసంఖ్యలో చేరి – విద్య నభ్యసిస్తున్నారు
ఎంతో దీక్షతో రాత్రింబవళ్ళు చదివి పరీక్షలు వ్రాస్తారు
విద్యార్థులకంటే తల్లిదండ్రులే ఫలితాలకోసం ఎదురుచూస్తారు
లక్షలుపోసి చదివిస్తున్నారు పిల్లలు అభివృద్ధిలోకి రావాలని
ఫలితాలు చూసి ఎందరో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు
ఇంటర్‌మీడియట్ బోర్డు నిర్వాకం చక్కగా బయటపడింది
ఫలితాలు మరలా ఒకసారి రీవాల్యుయేషన్ చేయమన్నారు
ఆత్మహత్యలతో తల్లిదండ్రులు బాగా క్రుంగిపోవడం జరిగింది
ఏం చేయాలో తోచక వారు దిగాలుగా ఏ దిక్కు తోచకున్నారు
చనిపోయినవారి పిల్లలను ప్రభుత్వం తిరిగి తీసుకురాగలదా?
ఎవరు దీనికి బాధ్యులు? పరీక్ష నిర్వాహకులా? ప్రభుత్వమా?
రీవాల్యుయేషన్‌లో తప్పిన విద్యార్థులు కృతార్థులయ్యారు
చనిపోయిన విద్యార్థులలో చాలామంది ఉత్తీర్ణులయ్యారు
ఆ తల్లిదండ్రులయితే నెత్తినోరు బాదుకుని విలపిస్తున్నారు
నిర్లక్ష్యం ఎవరిది? ఈ దిద్దినవారిదా? ఆ అధికారగణానిదా?
అసలు విద్యావిధానమే అస్తవ్యస్తంగా తాయరయింది
ప్రభుత్వాల నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి అసలు కారణం
ప్రయివేటు కళాశాలలు తెగబడి దోచుకుంటున్నారు
ఎప్పటికి ఈ విద్యావిధానం ప్రక్షాళన మవుతుందో!

కార్పొరేటు విద్య

– చెఱుకుపల్లి గాంగేయశాస్త్రి

కార్పొరేటు విద్య విజ్ఞానం మిధ్య
అది కార్పొరేటు విద్య కాదు హైరేటు విద్య
ఉన్నత తరగతివారికి కొరుకుడుపడని విద్య
మధ్య తరగతివారికి మింగుడుపడని విద్య
కింది తరగతివారికి అందని ద్రాక్ష ఈ విద్య
వల్లె వేయించట మొక్కటే ఇక్కడి తారకమంత్రం
రోజుకి 18 నుంచి 20 గంటలు ఇదే మంత్రం
విద్యార్థులకు అర్థమయిందా అది అనవసరం
వేరే స్కూళ్ళలో రాంకులు వచ్చినవాళ్ళకి గాలంవేస్తారు
ఊరూరు తిరిగి రాయితీ లందిస్తామని ప్రచారంచేస్తారు
రాంకుల లిస్టులతో పత్రికల పేజీలు నింపేస్తారు
అవి వాళ్ళవి కాకున్నా ప్రకటనలకు జనం పడిపోతారు
కోట్లు కొద్దీ డబ్బులు మూట కడతారు
యుందుగానే ప్రశ్నపత్రాలు కొనేస్తారు
రాంకులతో ఇంటికి వచ్చిన పిల్లలు
ఏమడిగినా పిచ్చిచూపులు వెఱ్ఱిచేష్టలు
దానితో తల్లిదండ్రుల గుండెల్లో దిగులు
ఇంతేకదా! ఇదేకదా! కార్పొరేటు విద్యంటే?

అమ్మ

– ఖడ్గపాణి, 9397090163

అమ్మ –
నా ఉనికికి మూలం
నా ప్రగతికి ఆలంబన
నా అస్తిత్వానికి చిరునామా
ఒక్క మాటలో చెప్పాలంటే
నా జీవితానికి 'కాపీరైట్'
అమ్మ –
నా జీవన ఎడారిలో
అమృతసోనల 'ఒయాసిస్సు'
అమ్మ –
నాలో జీవనది
నా అంతర్వాణి
నా అంతర్వాహిని
అమ్మ –
నాకొక కమ్మని అనుభూతి
అదే, నా జీవితానికి 'విభూతి'

విద్య

– డా. సప్పా దుర్గాప్రసాద్, 9849273096

విద్య వైద్యం ఉచితం ఒకనాటి భారతాన
అవే కోట్ల వ్యాపారం ఈ దేశంలో ఈనాడు
ఆంగ్లంలో అ ఆ లు నేర్పాలంటే లక్షలు
అమ్మ ఒడినుండే బడివ్యాపారం మొదలు
వైద్య విజ్ఞానం, సాంకేతిక విద్యలు
ఆర్థికస్థాయి లేనివారికి మిధ్యలే
చదువుకున్నవాడికంటే కొన్నవాడే గొప్ప
దేశ భవిష్యత్తుకి ఇసుకపునాదుల దిబ్బ
నాడిచూసి వైద్యం చేసే రోజులు గతం
శరీరాన్ని చీల్చి రక్షించే అవస్థల శకం
జలుబుకు కూడా చెయ్యాలట లెక్కలేని టెస్టులు
ప్రతి మెతుకు పట్టి చూస్తాయట కార్పొరేటు చదువులు
అమ్మనాన్నల ఆశయాలు అడుగంటిన బావి ఊటలు
మమ్మీ డాడీల ఆశలు దూసుకుపోతున్న రాకెట్‌లు
స్వదేశపు డబ్బులు పోసి పెంచిన మేధస్సుల చెట్లు
కాయాలట విదేశాల్లో పచ్చకార్డు డాలర్లు
కార్పొరేట్ గంధపుచెక్కల చితిమంటల్లో
రగిలిపోతున్న భారతీయ బాలల యౌవనాలు
కోట్ల వసంతాలు సాంస్కృతిక వికాస భారతం
గ్లోబలైజేషన్ మంటల్లో వెలిగిపోతున్న ఇండియా

మాటల్లో స్మార్ట్

– బెహరా వెంకటసుబ్బారావు, 9490186137

మాటల్లో స్మార్ట్ చేతల్లో నాట్
మాటల్లో స్వచ్ఛ్ చేతల్లో హేచ్
మాటల్లో హోదా చేతల్లో వాయిదా
మాటల్లో గట్టి చేతల్లో వట్టి
మాటల్లో మంత్రవాది
చేతల్లో (కు)తంత్రవాది
మాటల్లో ఒంటి చేతల్లో కుంటి
మాటల్లో కనికట్ చేతల్లో కట్టిపెట్టు

గన్నులొద్దు పెన్నులే ముద్దు
మౌఢ్యం వద్దు విచక్షణే ముద్దు
ద్వేషం వద్దు ప్రేమే ముద్దు
యుద్ధాలు వద్దు శాంతే ముద్దు
అవినీతి వద్దు నీతియే ముద్దు
కయ్యాలొద్దు నెయ్యాలే ముద్దు
అసత్యమొద్దు సత్యమే ముద్దు
అతి వద్దు మితమే ముద్దు

పోపుపెట్టె

- ఎస్.సాయిప్రసాద్, 9440470774

(పోపులపెట్టె (వంటింటి వైద్యురాలు) ఈ కవితను పంపినవారు
శ్రీ కొచ్చెర్లకోట సుబ్బారావుగారు. వారికి ధన్యవాదములు.)

ఉ. బామ్మకు బామ్మ బామ్మకును బామ్మల కాలమునుండి వంటలో
నమ్మకమైన నేస్తముగ నాలుకకున్ చవికల్గునట్లుగా
కమ్మదనమ్ము గూర్చుచు సుఖప్రదమై మహిమంబు చాటుచున్
యిమ్మహి 'పోపుపెట్టె' తరియింపగ జేతువె వంటకమ్ములన్

ఉ. వేడిగ కాగు తైలమున వేయుచు చారెడు పోపుగింజలన్
మాడకముందె తీయుచు నమాంతముగా కలుపంగ వంటలో
పోడిమితోడ దానికి నపూర్వ రుచిప్రభ లద్దుచుందువే
చేడియ కందుబాటున వసించి 'రసోయిన' 'పోపుపెట్టికా'

శా. ఆయుర్వృద్ధియు, స్వాస్థ్యకారకములై యత్యంత రుచ్యమ్ములై
ఆయుర్వేదపు టౌషధీ సుగుణ మాహాత్మ్యంబు లందింపగా
శ్రేయోదాయకమై వెలుంగు దినుసుల్ చేకూర్చి 'తాలింపు'తో
సాయంబుండెడి పోపుపెట్టె నరయన్ సాక్షాత్తు ధన్వంతరే

కం. 'తాలింపు' లేని వంటలు-గాలింప దొరకవు భరతఖండమునందున్
తేలింతువు రసజగతిని - పాలింతువు పోపుపెట్టె వంటగృహాలన్

కం. పొయ్యిని బాణలి నుంచుచు-చయ్యన మరగంగ నూనె చారెడు దినుసుల్
రయ్యని వేసినయంతనె-చుయ్యనుచును సిద్ధమగుదు శుభమగు పోపా!

కం. వంటింటి వైద్యురాలిగ-నింటింటా కొలువుదీరి యింపగు పెట్టెన్
గరిటెడునూనెను వేగుచు-ఘంటాపథముగ హితమును కలిగింతుగదే

ఆ.వె. రోటిపచ్చడికిని మేటి రుచినిగూర్చి-పాతపచ్చడులకు ప్రభను పెంచి
జిహ్వనంటినంత వహ్వాయనగజేయు-వరరుచిప్రదాత తిరగమోత

ఆ.వె. సూదశాలలోన సుదతీమణుల చేతి-వంటలోన చేరి వాయిలూర
చిత్రగతిన రుచిని చిటపటధ్వనితోడ-పొడమజేతువోయి 'పోపుపెట్టె'

కం.వృత్తాకారము నందున - చిత్తమ్మును దోచునట్టి చిరుగిన్నెలలో
నుత్తమ దినుసు లొసగుదువు- పుత్తడిబొమ్మల కరముల 'పోపులపెట్టీ'

కం. 'చిల్లర' మిగిల్చి పడతులు - నల్లన నీలోన దాచ, నవసరమందా
యిల్లాలి నాదుకొనుచున్ - చల్లగ నడిపింతు వీవు సంసారములన్

సీ. మేనికుష్ణము గూర్చు మేలైన 'ఆవాలు'
జీర్ణశక్తిని పెంచు 'జీలకర్ర'
చవియు,శక్తినొసగు శనగలున్ మినుములున్
గుండెబలము గూర్చు 'నెండు మిరప'
పైత్యదోషము నిట్టె పరిమార్చు 'మెంతులున్'
పసిడికాంతులొసగు 'పసుపు' పొడియు
నుదరకోశమునందు నుత్పన్నమౌ నొప్పి
చెడుగుణ 'మ్మింగువ' చెదరగొట్టు

ఆ.వె. దివ్యమైన యిట్టి దినుసులపాత్రలన్
పట్టి నిలిపి మాదు స్వాస్థ్యమునకు
గడపదాటనట్టి ఘనవైద్యురాలివై
కాపు కాయునట్టి 'పోపుపెట్టె'

భయమేస్తోంది

- మరాశాస్త్రి, 9885267370

నారాయణ! నారాయణ!
ఇవి చదువులా . . .?
ఆరు సంవత్సరాల వరకూ
హాయిగా ఆడుకునేవారం
అయిదో తరగతి కొచ్చినా
కులమతాల గురించి వినలేదు
బళ్ళోకూడా ఆటలు - పాటలు
నీతి కథలు - శతక పద్యాలు
ప్రాథమిక విద్య ప్రాధాన్యాలు
ఉన్నత విద్య ఉత్సాహభరితం
నాటకాలు-వక్తృత్వాలు-వ్యాసాలు
అలాగే కాలేజీకి వెళ్ళినా . . .
ఎస్సీ ఎస్టీ బిసి ఓసి . . .
ఈ మాటలేవీ విని ఎఱుగం
ఇదంతా గతం - ఇప్పుడా . . .!
మూడు దాటితే మాడు పగిలిందే
తన బరువుకన్నా బరువైన సంచులు
బండెడు టెక్ట్స్‌లు నోట్స్ పుస్తకాలు
దానికి సరిపడా బరువుగ ఫీజులు
బ్రతుకు తెరువు లేని రోజులయ్యాయి
ర్యాంకుల పోటీలు, బ్రతుకు గుఱ్ఱప్పందాలు
సూర్యోదయంనుంచి సూర్యాస్తమయం వరకు
కాలేజీ గదులనరాదు అవి కారాగారాలే
యమభటుల్లా కాపాలా కో ఆర్డినేటర్లు
తల పక్కకు తిప్పితే కపాలమోక్షాలే
ఇక ఇంటిదగ్గర పరిస్థితి చెప్పక్కర్లేదు
ర్యాంకు రాకుంటే ఇంటికి రానివ్వను
హుసేన్ సాగరో, కృష్ణానదో నీ యిష్టం
తల్లిదండ్రుల భయంకర హెచ్చరికలు
కులమత వివక్షలు - కుళ్ళు రాజకీయాలు
మూడు పదులు దాటినా ముక్తిలేని వత్తిడులు
తరం తరం మనుగడ ఔతోంది ప్రశ్నార్థకం
అందుకే మనిషిగా ఈనేలపై పుట్టాలంటేనే
భయం - భయం - భయోత్పాతం.

ముందే మేల్కొనలేమా?

- పరస జగన్నాథరావు

ఉదయాన్నే బ్రష్ చేస్తూ సింక్‌లో నీళ్ళు వదిలేస్తాం
ట్యాంకునుంచి నీళ్ళు రాకపోతే బెంగపడతాం
కళ్ళముందు నీరు వృధాగాపోతుంటే పట్టించుకోం
నీళ్ళకోసం మైళ్ళతరబడి నడవాలంటే తడబడతాం
ఎందుకు జాగ్రత్తపడం - ముందే మేల్కొనలేమా?
వర్షపుధారను ఒడిసిపట్టేందుకు గుంతలు తవ్వుదాం
'జలమే జీవం' తెలిసి నీటికోసం పాట్లను తరిమేద్దాం

బాపనోల్లు

'సావధానా... సావధానా...' అని వేదం ఘోషిస్తున్నది. కాబట్టి సావధానముగా ఇది చదవండి –

పరమత కుట్రకారులచే మన మెదళ్ళలో నాటబడ్డ బ్రాహ్మణ వ్యతిరేకసిద్ధాంతం అర్థంచేసుకోవడానికి బుఱ్ఱ ఉంటే చాలు ఎవరికైనా. అపారమైన తెలివితేటలు అవసరం లేదు. మన దేశాన్ని తురకలు 800 సంవత్సరాలు, కిరస్తానాలు 200 సంవత్సరాలు అప్రతిహతంగా పాలించారు. మరి మన దేశంలో కొన్ని వర్గాలవారు అభివృద్ధి చెందలేకపోవడానికి పూర్తిగా బ్రాహ్మణులే కారణం అంటుంటే మన బుఱ్ఱ ఎప్పుడైనా ఆలోచించిందా? మన దేశాన్ని పాలించిన చక్రవర్తులలో అధిక శాతం శూద్రులు కాదా? ఉదాహరణకు చంద్రగుప్త మౌర్యుడు, శ్రీకృష్ణదేవరాయలు, ఛత్రపతి శివాజీ వీళ్ళెవరూ బ్రాహ్మణులు కాదే? బ్రాహ్మణుడైన చాణక్యుడు లేకపోతే చరిత్రలో చంద్రగుప్తుని స్థానం ఎక్కడ?

మన పురాణాల్లో గాని, కథల్లో గాని మనం ఏం చదువు కున్నాం? 'అనగనగా ఒక ఊరిలో ఒక బీదబ్రాహ్మణుడు ఉండేవాడు. అతని కుటుంబానికి తినడానికి తిండి కూడా ఉండేది కాదు. ఒక దినం అతను అడవిలో వెళ్తుండగా...' ఇటువంటి కథలేకదా మనం చదువుకున్నది. మరి అంత పేద బ్రాహ్మణుడు వేరే వారిపై వివక్షత ఎలా చూపించాడంటారు చెప్పండి? నేడు హరిజనులుగా పేర్కొనబడుతున్న కొన్ని కులాలవారిని నిజానికి అణచివేసింది బ్రాహ్మణులేనా? నిజమేనా? మొత్తం బ్రాహ్మణులలో అర్చక వృత్తి చేపట్టేవారు కేవలం 20 శాతం మాత్రమే ఉంటారు. ఒకసారి ఆలోచించండి. మన స్నేహితుల్లో ఉన్న బ్రాహ్మణులలో ఎంతమంది అర్చకవృత్తి చేపట్టారో. నా స్నేహితుల్లో అర్చకవృత్తి చేపట్టినవారు అయితే ఎవరూ లేరు. మేధావులు చెప్పినట్లు బ్రాహ్మణులకు మాత్రమే వేదవిద్య అనుకుంటే నేడు మనకు ఆదికావ్యమైన రామాయణం ఉండేది కాదు. హిందువులకు అత్యంత పవిత్రమైన భగవద్గీత, పురాణాలు, మహాభారతాలూ ఉండేవి కావు. ఎందుకంటే వీటిని రచించినది బ్రాహ్మణులు కారు. ఎప్పటి సంగతో ఎందుకు హిందూ ధర్మ రక్షకుడు అయిన వివేకానందుడు బ్రాహ్మణుడు కాదు.

చరిత్రలో బ్రాహ్మణులపై దాడి : హిందువుల మహా పుణ్య క్షేత్రమైన కాశీలో గంగ ఒడ్డున మతం మారడానికి నిరాకరించారన్న కారణంతో లక్షా యాభై వేలమంది బ్రాహ్మణులను, వారి పిల్లలను నరికి చంపి 10 మైళ్ళకు సైతం కనబడేలా ఒక పెద్ద గుట్టగా వేశాడు ముస్లిం చక్రవర్తి. అంతేకాదు బ్రాహ్మణుల జంధ్యాలను తెంచి గుట్టగా పోసి నిప్పంటించి చలి కాచుకున్నాడు ఆ క్రూరుడు. కిరస్తానీ సెయింట్ జేవియర్ పోర్చుగల్ రాజుకి ఒక ఉత్తరం వ్రాశాడు. దాని సారాంశం ఏమిటంటే 'బ్రాహ్మణులను లేకుండా చేస్తే భారతీయులందరూ తేలిగ్గా కిరస్తానీయులుగా మారిపోతారు' అని. అర్థం అయిందికదా! బ్రాహ్మణ వ్యతిరేక సిద్ధాంతం వెనుక ఉన్న నిజకుట్ర ఇదీ. వేలమంది గౌడ సరస్వతి బ్రాహ్మణులను కిరాతకంగా నేరవిచారణ పేరుతో చంపించాడు దీనినే మనం 'గోవా ఇంక్విజిషన్' పేరుతో చరిత్రలో చదువుకుంటున్నాం. మైసూరు ప్రాంతం మేల్కొటేలో దీపావళిదినాన 800మంది అయ్యంగార్ బ్రాహ్మణులను ఊచకోత కోయించాడు టిప్పుసుల్తాన్. అందుకే ఇప్పటికీ ఆ ప్రాంతంలో బ్రాహ్మణులు దీపావళి పండుగను జరుపుకోరు. ఇక కాశ్మీరి పండితుల విషయం తెలియనిదేమీ కాదు. 'మతం మారతారా లేక ఇళ్ళు విడిచిపెట్టి పోతారా' అని నమాజ్ అనంతరం మైకుల్లో ప్రకటన చేస్తే ప్రాణాలు అరచేత పట్టుకుని ఢిల్లీ ప్లాటుఫారాలపైకి చేరి దిక్కులేని జీవితం గడుపుతున్నారు వేలాదిమంది కాశ్మీరీయ పండితులు. జీహాదీల చేతుల్లో దాదాపుగా హత్య చేయబడ్డవారు ఐదు లక్షలమంది.

మీకు తెలుసా? కాశీలో రిక్షా తొక్కుకుని జీవించేవారిలో అధికశాతం బ్రాహ్మణులే. ఢిల్లీ రైల్వేస్టేషనులో కూలీలుగా పనిచేసే వారిలో యాభై శాతం బ్రాహ్మణులే. ఆంధ్రప్రదేశ్‌లో వంటపని వారుగా పనిచేసేవారిలో డబ్భైఅయిదు శాతం బ్రాహ్మణులే. తమిళ నాడు శ్రీరంగనాథస్వామివారి గుళ్ళో అర్చకుడిగా పనిచేసే బ్రాహ్మణుడి నెల జీతం కేవలం 300/- రూపాయలు. ఈ బాధలు పడలేకే చదువుకున్న బ్రాహ్మణులు ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ విదేశాల్లో స్థిరపడుతూ అక్కడ మన సంప్రదాయాలను ప్రచారం చేస్తున్నారు. బ్రాహ్మణులు ప్రధానంగా జ్ఞానానికి ప్రాముఖ్యత ఇవ్వడం వల్ల మతమార్పిడి మాఫియాలు ఎక్కువగా బ్రాహ్మణ వ్యతిరేక కథలు ప్రచారం చేస్తున్నాయి. వారు చెప్పే కాకమ్మకథలు చరిత్రలో ఎక్కడా కనబడవు. కాని ఒక అబద్ధాన్ని 'అదే పనిగా' చెబితే దాన్నే నిజమని అనుకుంటుంది ఆలోచించేసమయంలేని లోకం. ఇదే వారి సిద్ధాంతం.

కాబట్టి కళ్ళు తెరుద్దాం. సత్యమేమిటో తెలుసుకుందాం. ఒకరినొకరు ద్వేషించుకోవడం మానేద్దాం. కలిసి బ్రతుకుదాం.

ద్వేషం దూరం చేస్తుంది – ప్రేమ దరి చేరుస్తుంది.

సర్వే జనాః – లోకాః సమస్తాః సుఖినో భవన్తు.

ఈ సత్యాన్ని మీరెప్పుడైనా ఆలోచించారా?

మా తాతగారు ప్రతినిత్యం గోదావరినీటినే త్రాగేవారు
మా నాన్నగారయితే ప్రతిరోజు నూతినీటినే త్రాగేవారు
నేను మాత్రం ప్రతిరోజు కుళాయి నీళ్ళే త్రాగుతున్నాను
నా పిల్లలు వాటర్ కేన్ తెప్పించుకునే త్రాగాలి
నా మనవలు కేప్సుల్ వేసుకుని సరిపెట్టుకోవాలేమో
మనం నీటిని అశ్రద్ధ చేస్తే కన్నీళ్ళయినా ఉండవేమో!

బోధి వృక్షం

– వుప్పల నరసింహం, 9985781799

బీహార్ (ఒకప్పుడు కపిలవస్తు రాజ్యం) లోని బోధ్‌గయలో గల 'బోధివృక్షం' సందర్శించేందుకు బౌద్ధమతస్తులు తరలి వస్తుంటారు. ముస్లిములకు 'మక్కా', క్రైస్తవులకు 'జెరూసలెం' ఎలాగో బౌద్ధం ఆచరించేవారు 'బోధ్‌గయ'ను అంత పవిత్రంగా భావిస్తారు. రెండున్నరవేల ఏళ్ళక్రితం సిద్ధార్థుడు ఈ వృక్షం క్రిందనే కూర్చుని 'ధ్యానం' చేయగా 'జ్ఞానోదయ'మైంది. కాబట్టి ఆ ప్రాంతాన్ని, ఆ చెట్టును పవిత్రంగా పవిత్రంగా భావిస్తారు. తెలుగులో దీన్ని 'రావి చెట్టు' అంటారు. దాని శాస్త్రీయ నామం 'ఫికస్ రిలిజియస'. కాని ప్రపంచవ్యాప్తంగా 'బోధివృక్షం'గ సంస్కృతం పేరుతో ప్రచారం చేశారు, చేస్తున్నారు. వాస్తవానికి బుద్ధుడు సంస్కృత భాషను కాక పాళీ భాషను ప్రేమించాడనీ, ఆ రోజుల్లో జనబాహుళ్యం భాష అది కాబట్టి దానికి ప్రాముఖ్యం ఇచ్చాడంటారు. పాళీ భాషలో ఆ చెట్టును పిలవలేదు. అందరి నోళ్ళలోనూ కూడా 'బోధివృక్ష'మన్న మాటలు వినబడేలా చూశారు.

ఆనాడు సంస్కృతం బ్రాహ్మణుల ఆరవ ప్రాణం. సాధికారిక గ్రంథాలన్నీ సంస్కృతంలోనే ఉన్నాయి. ముని కుటీరాలలో, గురుకులాలలో సంస్కృత భాషనే, ఆ మాధ్యమంలోనే బోధించారు. అది సుసంపన్నమైన భాషగా గుర్తింపు పొందింది. ఆ రకంగా రావిచెట్టు కాస్త 'బోధివృక్షం'గా ప్రసిద్ధి చెందింది. పవిత్రమైన గంగా నది ఉపనదికి ఆనుకుని ఉన్న విష్ణు దేవాలయం వద్ద బోధివృక్షం కింద ధ్యానం చేస్తే ఫలితముంటుందని బ్రాహ్మణ సన్యాసులు బుద్ధునికి సూచించారు. బ్రాహ్మణులు లేకుండా సంస్కృతం లేదు. సంస్కృతం లేకుండా బౌద్ధం లేదు. ఆ మాట కొందరికి ఆగ్రహం కలిగించవచ్చుగాని ఇది 'సత్యం'. బ్రాహ్మణ (సంస్కృత) శంఖంలో నీళ్ళుపోస్తే అది తీర్థం (బౌద్ధం)గ మారింది. పవిత్రతను సంపాదించుకుంది. తొలినుంచి జరిగిన పరిణామాలను పరిశీలిస్తే తేలే సారాంశం ఇదే! అతిశయాన్ని, అహాన్ని విడనాడి పరిశీలన చేస్తే వాస్తవాలు వెల్లడవుతాయి. 'బుద్ధం శరణం గచ్ఛామి', 'ధర్మం శరణం గచ్ఛామి' అన్న నినాదాలు, బోధనలు సైతం సంస్కృత భాష భూయిష్టమైనవే తప్ప పాళీ భాషనో, మరో ప్రాంతీయ భాషా పదజాలమో కాదు. ఆ నినాదాలు రూపొందించింది సైతం బుద్ధుని తొలి శిష్యులైన బ్రాహ్మణులే!!!

గౌతమ బుద్ధుడు తనకు 'జ్ఞానోదయం' కలిగిందని భావించిన వెనువెంటనే బోధ్‌గయనుంచి సారనాథ్ పయనమై తనతో చాలాకాలం ధ్యానం చేసిన బ్రాహ్మణులను కలిశాడు. క్షత్రియుడైన సిద్ధార్థుడిపై హిందూ ధర్మం ఆచరించే ఆ బ్రాహ్మణులు వివక్ష చూపలేదు. జ్ఞానాన్ని పంచుకున్నారు. అంతవరకు పోగైన జ్ఞాన సంపదను సిద్ధార్థునికి పరిచయం చేశారు. అందులోని సారాన్ని అందించారు. అశ్వత్థవృక్షం (బోధివృక్షం) ప్రాశస్త్యాన్ని తెలిపారు. ఆ పునాదులపైనే, ఆ మార్గంలోనే, ఆ తపస్సు – ధ్యా న మార్గాల ఆధారంగా సిద్ధార్థుడు పయనమయ్యాడే తప్ప కొత్తమార్గం, కొత్త దారిలో పయనించలేదు. సిద్ధార్థునికి ఆధారమల్లా తోటి బ్రాహ్మణ సన్యాసుల మార్గదర్శనం, వారి ఆచార వ్యవహారాలు, అప్పటికే అచరణలో ఉన్న ధ్యానం, తపస్సు, యోగ పద్ధతులు. వాటినే ఆయన ఆచరించారు. అప్పటికే సంవత్సరాలపాటు వారి సాహచర్యం కారణంగా, ఆ బోధనలు మనసులో నింపుకొని మనోక్షేత్రంలో ఆ సంస్కృతశ్లోకాల ఉచ్చారణ, ధ్యానం, యోగ ఈ భూమికనుంచి మొలకెత్తినవే బుద్ధుని పలుకులు. సహజంగానే ఆ సారమంతా ఆ పలుకుల్లో పరిమళించింది. బ్రాహ్మణులు సంస్కృత భాషవినా బుద్ధుని 'మనోవికాసం' కనబడదు. ఆయన కమలపుష్పం, చేతిముద్ర, కాషాయవస్త్రం ఇలా సర్వం బ్రాహ్మణ, సనాతన బ్రాహ్మణ సంప్రదాయంలోంచి వచ్చినవే తప్ప కొత్త చిహ్నాలు కావు. కొత్త ఆవిష్కరణలు అంతకన్నా కావు. సనాతన బ్రాహ్మణ సంప్రదాయం కొనసాగింపే 'బౌద్ధం' అంటే అతిశయోక్తి కాదు.

పురాణాల్లో అశ్వత్థవృక్షం మహాత్మ్యం తెలిసేకే గౌతముడు ఆ వృక్షాన్ని ఎంపిక చేసుకున్నాడన్నది యదార్థం. బుద్ధుడు పునర్జన్మను అంగీకరించడంతోనే తోటి బ్రాహ్మణ సన్యాసులు బుద్ధుని బోధనలపట్ల సానుకూలత కనబరిచి తలకెత్తుకున్నారు. కర్మ సిద్ధాంతానికి ఊపిరిలాంటిది పునర్జన్మ. అంటే హిందూ ధర్మాన్ని కించిత్ కూడా కించపరచడం లేదు కాబట్టి బ్రహ్మణ సన్యాసులు బుద్ధుడిని తమలో కలుపుకున్నారు. అతనితో కలిసిపోయారు. ఆ రకంగా వారు అద్వైతాన్ని తిలకించారు. ఆ తత్త్వం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. కర్మ సిద్ధాంత ఫలం పునర్జన్మ కావడంతో విభేదించడానికి అవకాశం హిందూ ధర్మం ఆచరించేవారికి అగుపించలేదు. అందుకే బ్రాహ్మణులు తమ జ్ఞానాన్ని, ధారణాశక్తిని, విస్తృత అధ్యయన అనుభవాన్ని, సంస్కృత భాషా పటిమను బౌద్ధ బోధనలకు జత చేశారు. ఆ విధంగనే రావిచెట్టు కాస్తా బోధివృక్షం అయింది. బుద్ధుడిని నమ్మండి అనే మాట కాస్తా బుద్ధం శరణం గచ్ఛామి అయింది. విష్ణువు నాభిలోంచి వచ్చిందని భావించే పద్మం – ఆ కమలాన్ని బుద్ధుడికి విష్ణు దేవాలయం ప్రక్కనగల బోధివృక్షంవద్ద సమర్పించారు. చివరికి ఆ పద్మమే – కమలమే అతనికి ఆసనమైంది. అంతా సనాతన హిందూ ధర్మం కొనసాగింపుగానే దర్శనమవుతోందికదా! దాని కొనసాగింపుగా కనిపిస్తోందికదా!

అంతేగాక ఆకాశంలో సగభాగంగా భావించే మహిళలను 'సంఘం'లోకి తీసుకోవాలని బుద్ధునికి సూచించింది బ్రాహ్మణ శిష్యులే. ఆ రకంగా సన్యాసినుల సంఖ్య పెరిగింది. ఈ మాత్రందానికి వీరావేశాలు ప్రదర్శించడం అవసరమా? సమ్యక్ దృష్టిని కోల్పోవడం న్యాయమా? వర్తమానంలో బుద్ధుని బోధనలపట్ల ఆకర్షితులై బౌద్ధాన్ని ఆచరిస్తున్నామనే వారిలో ప్రేమ, కరుణ, దయ, వినమ్రత, నిరాడంబరత, పరోపకారం, జీవకారుణ్యం కనిపించదు. ఎంతసేపూ మరో మతానికి పోటీగా దానికి ప్రచ్ఛన్నంగా బౌద్ధ ధర్మాన్ని (మతాన్ని) నిలపాలన్న యావ తప్ప బుద్ధుని మౌలిక బోధనల ఆచరణ, అనుసరణ కనబడదు. మహాయానం,

హీనయానం అంటూ హీనంగా కొట్టుకోవడమే కనిపిస్తోంది. తాజాగా జెన్‌గా బౌద్ధం రూపాంతరం చెందింది. మరో ఇరవై ధోరణులు ప్రబలుతున్నాయి. ఒక్కొక్కరు ఒక్కొక్క వైఖరి అవలంబిస్తున్నారు. బుద్ధగయలో వాటి ఛాయలు స్పష్టంగా దర్శనమిస్తాయి. వివిధ దేశాల నిర్మాణ, వాస్తుశైలికి అనుగుణంగా ఆరాధనా మందిరాలు-పగోడాలు, గోపురాలు, మేడలు, ఆరామాలు మెరుస్తున్నాయి. చిత్రమేమిటంటే నకిలీ (సూడో) సన్యాసుల బెడదతో అసలైన సన్యాసులు సతమతమవుతున్నారు. ఇదొక ఉపాధి మార్గంగా బుద్ధగయలో మారింది. భిక్షాపాత్రతో బయలుదేరడం సరేసరి!

కార్పొరేట్ కల్చర్‌కు అనుగుణంగా అనేక యోగా కేంద్రాలు, ఒత్తిడిన నియంత్రణ, ఒత్తిడి తగ్గింపు కేంద్రాల మాదిరి బౌద్ధక్షేత్రాలు వివిధ దేశాలలో వెలుస్తున్నాయి. అత్యాధునికి సౌకర్యాలతో 'విపాశన' నేర్పించే సంస్థలు వెలిశాయి. అనేక 'కల్ట్'లు పుట్టుకొచ్చాయి. అమెరికా వాళ్ళు, యూరప్ వాళ్ళు సైతం ఇందులో తమతమ ప్రత్యేక పద్ధతులను 'ప్రమోట్' చేసేందుకు పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో భారతదేశంలో బౌద్ధాన్ని సనాతన ధర్మాన్ని 'ప్రచ్ఛన్నం'గా భావించి సనాతన ధర్మం మెడలు విరవాలని, తమలోని ఆగ్రహాన్ని (అహాన్ని) చల్లార్చుకోవడానికి, నాలుగు రాళ్ళ వేయడానికి, నిందాపూర్వకంగా తూలనాడే ప్రసంగాలు చేయడానికి బౌద్ధాన్ని దగ్గరికి తీసుకుంటున్నారు. అక్కున చేర్చుకుంటున్నారు. సాంత్వన పేర 'సమిధలు' విసురుతున్నారు. వివేకం, వివేచన, విజ్ఞత, సమ్యక్ జ్ఞానం సమాధి చేస్తున్నారు. ఇలాంటిదెప్పుడూ బుద్ధుడు కోరుకోలేదని వీరికి ఇంకెప్పటికి బోధపడుతుంది? అందుకోసం అలాంటివారు వర్తమానంలో బోధివృక్షాన్ని ఆశ్రయిస్తే మంచిదేమో!!!

మాటతీరు

మాట తీరు మనిషి సంస్కారానికి గీటురాయి. (మాటలు చాలా పదునైనవి కనుక చాలా జాగ్రత్తగా వాడాలి) ఒంటరిగా ఉన్నప్పుడు ఆలోచనల్ని - నలుగురిలో ఉన్నప్పుడు నాలుకని అదుపులో ఉంచుకోగలిగితే మన జీవితం అదుపుతప్పకుండా ఉంటుంది. నాలుకను అదుపు చేసుకోగల విద్య తెలిస్తే, అనేక విద్యలు అవలీలగా వంటబడతాయి. నోటిని అదుపులో పెట్టుకుని అందరితో మర్యాదగా మాట్లాడుతూ, సభ్యతతో నడుచుకుంటూ ఉండే ఎప్పుడైనా, ఎక్కడైనా మంచే జరుగుతుంది.

చెట్టు సారం పండులో వ్యక్తమైనట్లుగా, మనిషి సారం అతని మాటలో తొంగిచూస్తూ ఉంటుంది. మంగళకరమైన మాట తీరు మనిషి సంస్కారానికి గీటురాయి. మనిషికి నిజమైన అలంకారం అతని మాట తీరే. 'వాగ్భూషణం భూషణం' అన్నా రందుకే -

'కేయూరాణి న భూషయంతి పురుషం హారా న చంద్రోజ్జ్వలా
న స్నానం న విలేపనం న కుసుమం నాలంకృతా మూర్ధజాః
వాణ్యేకా సమలంకరోతి పురుషం యా సంస్కృతా ధార్యతే
క్షీయంతే ఖలు భూషణాని సతతం, వాగ్భూషణం భూషణం'

ఇది భర్తృహరి నీతిశతకంలో విద్వత్ పద్ధతిని చెప్పే శ్లోకాల్లో ఒకటి. 'వాగ్భూషణ మొక్కటే సుభూషణమ'న్నాడు భర్తృహరి.

సంభాషణం, మితభాషణం, హితభాషణం, స్మితభాషణం ప్రియభాషణం, పూర్వభాషణం, సత్యభాషణం అయినప్పుడు అంతకన్న భూషణం మరొకటి లేదు. 'మితంగా హితంగా మాట్లాడాలి, మనిషికి గౌరవం తెచ్చేవి ఇవే' అనేవారు గాంధీజీ. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ మాట్లాడుతూండాలి. మధుర భాషణం వల్ల మర్యాద లభిస్తుంది. నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది కదా! ప్రియంగా మాట్లాడాలి. ఎదుటివారిని ముందుగా మనమే పలకరించడం పూర్వభాషణం. శ్రీరాముడు స్మిత పూర్వభాషి. మాట కన్నా ముందు ఆయన చిరునవ్వు ఎదుటివారిని పలకరించేది. సత్యమే సర్వోన్నతమైనది కనుక నిర్భయంగా సత్యమే పలుకు. ఆ సత్యాన్ని ప్రేమగా, నేర్పుగా చెప్పాలి. మర్యాదగా హుందాగా మాట్లాడాలి. ఆలోచించకుండా మాట్లాడటం, గురి చూడకుండా బాణం వేయడం లాంటిది. మాట్లాడిన తరువాత ఆలోచించాల్సిన అవసరం రాకూడదు. కాబట్టి ఆలోచించి ఆచితూచి మాట్లాడాలి.

'తాను ఏం మాట్లాడాలో తెలిసినవాడు తెలివైనవాడు, తాను ఏం మాట్లాడకూడదో తెలుసుకోగలిగినవాడు వివేకవంతుడు' అన్నారు స్వామి వివేకానంద. ఎవరైతే తమ మాటలవల్ల, చేతలవల్ల ఇతరులకు బాధ కలిగించకుండా ఉంటారో వారే ఉత్తములు. ఆచరిస్తూ చెప్పే మాటలకు ఆదరణ ఎక్కువ. ఆదరణపూర్వకంగా చెప్పే మాటలకు ఆచరణ ఎక్కువ. ఆకట్టుకునే మాట్లాడటం ఒక కళ. అయితే ఆ మాటలను ఎప్పుడు మొదలపెట్టాలో, ఎప్పుడు ఆపాలో తెలియడం మరీ గొప్ప కళ. మాటలే మంత్రాలు, చెట్లే ఔషధాలు. మాటలు చాలా పదునైనవి కనుక చాలా జాగ్రత్తగా వాడాలి. బలమైనవి కనుక సున్నితంగా వాడాలి. ఖరీదైనవి కనుక పొదుపుగా వాడాలి. మాట్లాడటం అందరూ చేస్తారు. అయితే అందరిలాగ కేవలం నోటితో మాట్లాడితే సరిపోదు. మరింత ప్రభావాన్వితంగా ఉండాలంటే మనసుతో, శరీరంతో మాట్లాడాలి. మాటే సంపదలకు, మానవ సంబంధాలకు మూలం. మాటే స్నేహితుల్ని సంపాదించి పెడుతుంది. శత్రువుల్నీ తయారు చేస్తుంది.

'నొప్పింపక తా నొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు' అలాంటి వారికి శత్రువులే ఉండరు. మాటలు గాయపరచగలవు. అదే గాయాన్ని నయం చేయనూగలవు. సరైన మాటతీరు చంపడానికి వచ్చిన శత్రువు మనసునైనా మార్చగలదు. మాటల మధ్యలో సందర్భానుసారంగ సామెతలు, లోకోక్తులు వాడితే, అతి మధురమైన పదాలు మరింత మధురంగా, వినసొంపుగా అనిపిస్తుంది. సంభాషణ సరస చతురత కలిగి ఉండాలి. తిడుతూనే నవ్వించే హాస్య కుశలత కలిగి ఉండాలి. ఎవరితో ఎప్పుడు ఎలా మాట్లాడాలో తెలిసి ఉండాలి. ఈ విషయంలో రాముడు, హనుమ మనకు ఆదర్శం కావాలి. మనిషికి భావవ్యక్తీకరణ గొప్ప ఆస్తి. ఏం చెప్పేరనేదానికన్నా, ఎలా చెప్పేరన్నదాన్నిబట్టి భావప్రసరణ మరింత ఆకర్షణీయంగా ఉంటుంది. భావవ్యక్తీకరణ ఎంత గొప్పగావుంటే ఫలితం అంత మహత్తరంగా ఉంటుంది.

పద్యం చెరగని సత్యం – పద్యం తరగని ధనం

- ప్రాచార్య శలాక రఘునాథశర్మ

శరణంబని వచ్చిన భీ
కర శత్రునినయినc బ్రీతిc గావcగవలయుం
గరుణాపరుల తెఱంగిది
యిరవుగ సరిగావు దీని కే ధర్మంబుల్ అర.5.413

అరణ్యవాసంలో అష్టకష్టాలు పడుతున్న పాండవులను చూచి వెక్కిరించి తృప్తిపొందాలనే దురాలోచనతో ఘోషయాత్ర (గోవులమందలను చూడటానికి చేసే యాత్ర) నెపంతో ద్వైతవనం వచ్చాడు దుర్యోధనుడు బంధు మిత్ర పత్నీ పరివార సమేతంగా. అక్కడ గంధర్వులు అతనిని యుద్ధంలో ఓడించి బంధించి తమ లోకానికి తీసుకొనిపోతున్నారు. ధర్మరాజు అప్పుడు ఆ అరణ్యంలోనే అందుబాటులో ఉన్న సాధనసంపదతో ఒక యజ్ఞం చేస్తున్నాడు. దుర్యోధనుని పరివారం ఆక్రోశిస్తూ అతని దుస్థితిని ధర్మరాజుకు వివరించారు. కౌరవులను కాపాడవలసిందిగా తన తమ్ములను కోరాడు ధర్మరాజు. కానీ ఒక పట్టాన వారు దానికి సిద్ధపడలేదు. వారు మన శత్రువులు. వారిని కాపాడటం ఉచితమా? అని వివాదం లేవదీశారు. ఆ సందర్భంలో ధర్మరాజు తన తమ్ములతో ఈ మాట అంటున్నాడు.

ఇది ఎఱ్ఱన వ్రాసిన అరణ్యపర్వభాగంలోనిది. భావ మాలిన్యాన్ని శుద్ధిచేసే సూక్తిపరమైన చక్కని కందం.

కాపాడు మహాప్రభో అని వచ్చిన భయంకరుడైన శత్రువును కూడా ప్రీతితో కాపాడాలి. దయ నిండుగా గలవారి తీరు ఇట్టిది. మరి ఏ ధర్మాలు కూడా ఇలా కాపాడటానికి సమానం కావు.

తల్లిదండ్రులు ఆయనకు పెట్టిన పేరు యుధిష్ఠిరుడు. స్వభావపరంగా ఆయన సాధించుకున్న పేరు ధర్మరాజు. చిత్రం ఏమిటంటే ఆ పుట్టుపేరుకంటే ఈ ఏర్పడినపేరే ఎక్కువగా వ్యవహారంలో స్థిరపడింది. అది ఎంత సార్థకమో తెలిపే ఘట్టాలలో ఇది ఒకటి.

దుర్యోధనుడ సర్వకాల సర్వావస్థలలో పాండవులను పరిమార్చాలనే (నాశనంచేయాలనే) తీవ్రభావనతో ఉన్నవాడు. మహానుభావులైన భీష్మద్రోణాదులను కూడా అధికారబలంతో ఆ పనిలో పురికొల్పి కార్యాన్ని సాధించాలనే గట్టి పట్టుదలతో కార్యరంగంలోకి దూకగలవాడు.

ప్రస్తుతంలో వనవాసం చేస్తున్న పాండవులను వెక్కిరించడానికి వచ్చి గంధర్వుల చేతిలో భంగపడ్డాడు. అతని పరివారం ఆక్రోశిస్తూ నీ తమ్ముణ్ణి పరిరక్షించు అని మొత్తుకున్నారు. భీముడు సంతోషించటమే కాదు, దుర్యోధనుని దుర్గుణాలను ఏకరువు పెట్టి వానిమీద దయ చూపవలదని ఒక హెచ్చరిక కూడా చేశాడు. కానీ ధర్మజుడ అజాతశత్రువు (పుట్టని పగవారు కలవాడు) కదా! అనేక విధాలుగా భీమసేనునికి నచ్చచెబుగూ ఈ మాట అన్నాడు.

వాడు భీకర శత్రువు. శత్రువు అంటే శాతనం – తల తీసివేయటం వంటిపని చేసేవాడు. అదికూడా భీకరంగా – భయం కలిగిస్తూ. అయినా శరణు – నీవే నాకు రక్షణ కల్పించాలి అంటూ వస్తే కాపాడాలి. ఊరకే మొక్కుబడిగా కాదు, ప్రీతితో. అందులోని రహస్యం ఏమిటంటే, బుద్ధిమంతుడు ఏదో ఒకవిధంగా పగను అణగించటానికే చూస్తాడు. పెంచటానికి చూడటం దుర్జనలక్షణం. త్రుంచివేయటం సుజనలక్షణం. భాగవతంలో భగవంతుడు 'సుజనులందు తరచు చొచ్చియుందు' అన్నాడు. కనుక సుజనత్వాన్ని ప్రోదిచేసుకోవటం భగవంతుణ్ణి తనలోనికి పిలుచుకొని ప్రతిష్ఠించుకోవటం అన్నమాట. అందువలననే ధర్మరాజు దీనికి ఏ ధర్మాలూ సాటి కావు అని స్పష్టమైన ప్రకటన చేశాడు. 'తనను కాపాడేది వ్యక్తులు కారు. శక్తులు కావు. తన శాంతమె తనకు రక్ష' అనికదా పెద్దలమాట! అందుచేత అతడు భీముణ్ణి దుర్యోధన రక్షణకు ప్రీతితో నియోగిస్తున్నాడు.

ఆయన మరొక చక్కని మాట అన్నాడు. 'కరుణాపరుల తెఱంగు ఇది' పసిపిల్లవాడు అమ్మ ఒడిలో చేరి పాలుత్రాగుతూ కాళ్ళతో ఆమెను తన్నుతూంటాడు. చేతులతో కేశాలు మొదలైన వానిని గుంజుతూ ఇబ్బంది కలిగిస్తూ ఉంటాడు. అయినా తల్లికి కోపం రాదు. పైగా ఆ చేష్టలకు మురిసిపోతుంది. దానికి కారణం వాత్సల్యరూపమైన కరుణ. ఆ విధంగా అమ్మ అమృతమూర్తి ఔతున్నది. ఆ స్థానం సంపాదించే స్వభావం కలవారే కరుణాపరులు. వారు ఎందరెన్ని చెప్పినా ఆ తీరు మారదు. అందుకే ఆయన 'కరుణాపరుల తెఱంగు ఇది' అని ప్రకటించాడు.

ధర్మరాజు ప్రవర్తించిన ఈ తీరునుబట్టిఈ పద్యం లోకానికి మార్గదర్శక సూత్రంగా ఏర్పడింది.ః

చంపదగినయట్టి శత్రువు తనచేతc
జిక్కెనేని వానిc జెఱుప రాదు
పొసcగ మేలు చేసి పొమ్మనుటే చాలు
విశ్వదాభిరామ! వినుర! వేమ!

తెలుగు భాషాభివృద్ధికి కృషిచేస్తున్న పత్రిక 'కళాగౌతమి' – చందాదారులుగా చేరండి – పత్రికను నిలబెట్టండి.

అరుంధతి నక్షత్రం

– కురువ శ్రీనివాసులు, 9393195669

అరుంధతి జన్మ వృత్తాంతం శివపురాణంలోనూ, భాగవతపురాణంలోనూ కన్పిస్తుంది. 'అరుంధత్యనసూయాచ, సావిత్రీ జానకీ సతి, తేజస్వినీచ పాంచాలీ, వందనీయం నిరంతరం' అరుంధతి, అనసూయ, సావిత్రి, సీత, ద్రౌపది ఈ ఐదుగురు స్త్రీలు సదా వందనీయులు అని ఈ శ్లోకానికి అర్థం. అరుంధతి జన్మ వృత్తాంతాన్ని సూతమహర్షి శౌనకాది మహామునులకి ఇలా వివరించాడు.

ఒకనాటి ప్రశాంత సమయంలో బ్రహ్మదేవుడు తన మనో కల్పంతో అత్యంత రూపవతియైన కన్యను, వర్ణింప నలవికాని సుందరాకారుడిని సృష్టించాడు. ఆ కన్య పేరు సంధ్య. ఆ యువకుని పేరు మన్మథుడు. సృష్టికార్యంలో తనకు సహాయపడమని ఆ యువకుడికి చెబుతూ బ్రహ్మ అతడికి అరవిందము, అశోకము, చూతము, నవమల్లిక, నీలోత్పలము అనే ఐదు బాణాలనిచ్చాడు. మన్మథుడు బ్రహ్మదేవుడిచిచన బాణశక్తిని పరీక్షించదలచి వాటిని బ్రహ్మలోక వాసులపైనే ఎక్కుపెట్టాడు. అపుడు బ్రహ్మతో సహా అక్కడ వున్నవారందరూ సంధ్యను చూసి మోహానికి గురయ్యారు. ప్రమాదాన్ని పసిగట్టిన వాగ్దేవి ఈశ్వరుడిని ప్రార్థించగా, ఈశ్వరుడు అక్కడ ప్రత్యక్షమై పరిస్థితిని చక్కదిద్దాడు. రెప్పపాటు కాలంలో జరిగిన తప్పుకు తలవంచిన సృష్టికర్త కోపంతో ఈశ్వరుని నేత్రాగ్నిలోపడి భస్మ మవుతావని మన్మథుడికి శాపం ఇచ్చాడు.

తనవల్ల ఇంతమంది నిగ్రహం కోల్పోయారని సంధ్య చంద్రభాగా నదీతీరంలో తపస్సు పేరిట తనువు చాలించేందుకు పయనమైపోయింది. అపుడు బ్రహ్మ వశిష్ఠ మహామునిని పిల్చి సంధ్యకు తపోదీక్షను అనుగ్రహించమని కోరాడు. వశిష్ఠుడు ఆమెకు శివమంత్రానుష్ఠానం వివరించి తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు. సంధ్య తదేక నిష్ఠతో తపమాచరించి శివుని అనుగ్రహాన్ని పొందింది. శివుడు ప్రత్యక్షమై ఆమెను వరం కోరుకోమన్నాడు. ఈ లోకంలో సమస్త ప్రాణులకు యౌవనం వచ్చేదాకా కామవికారం కల్గరాదనే వరాన్ని ఆమె కోరుకుంది.


అపుడు సంధ్య 'నా భర్త తప్ప పరపురుష దెవరైనా నన్ను కామదృష్టితో చూచినట్లయితే వారు పుంసత్వాన్ని కోల్పోవాలనీ, అంతేగాక తాను పుట్టగానే అనేకమందికి కామవికారం కల్గించాను కనుక ఈ దేహం నశించిపోవాలని కోరుకుంది. శివుడు తథాస్తు అంటూ 'మేధతిథి అనే మహర్షి గత పుష్కరకాలంగా యాగం చేస్తున్నాడు. ఆయన యాగకుండంలో అదృశ్యురాలవై శరీరాన్ని దగ్ధం చేసుకొని తిరిగి అదే అగ్నికుండంనుంచి నువ్వు జన్మిస్తావు. నీ శరీరం నశించే సమయంలో ఎవరినైతే భర్తగా తలుస్తావో అతడే నీ భర్త అవుతాడ'ని చెప్పి అంతర్థానమయ్యాడు. శివాజ్ఞగా సంధ్య తన శరీరాన్ని అగ్నికుండంలో దగ్ధం చేస్తూ వశిష్ఠుడే తన భర్త కావాలని కోరుకుంది. అలాగే అగ్నికుండంనుంచి తిరిగి జన్మించింది.

సంస్కృత భాషలో అరుం అంటే అగ్ని, తేజము, బంగారం వన్నె అనే అర్థాలున్నాయి. ధతి అంటే ధరించినది అని అర్థం ఉంది. అగ్నినుంచి తిరిగి పుట్టింది కనుక ఆమె అరుంధతి అయింది. పరమేశ్వర వరప్రసాదమైన అరుంధతిని యాగకర్తయైన మేధతిథి పెంచి పెద్దచేసి వశిష్ఠునికిచ్చి వివాహం చేశాడు. అరుంధతి తన పాతివ్రత్య మహిమవల్ల త్రిలోక పూజ్యురాలయింది. అరుంధతి వశిష్ఠ మహర్షి ధర్మపత్ని, మహా పతివ్రత అని ఆకాశం వంక పెళ్ళి సమయంలో చూపించి చెబుతారు పురోహితులు. అలా అరుంధతిని చూస్తే మీ సాంసారిక జీవనం నల్లేరుమీద నడకలా సాగుతుందని పండితులు వధూవరులకు చెబుతారు.

మాఘమాసాది కాలమందు తప్ప ఈ నక్షత్రం సాయంత్రం వేళ కనబడదు. రాత్రిపూట చంద్రుణ్ణి, నక్షత్రాలను చూడటంవలన కంటిశక్తి పెరుగుతుంది. అరుంధతి నక్షత్రంనుంచి వచ్చే కిరణాలవల్ల కంటిశక్తి మరింత పెరుగుతుంది. అరుంధతి నక్షత్రం సప్తర్షి మండలంలో ఉండే చిన్న నక్షత్రం. శిశిర, వసంత, గ్రీష్మ ఋతువులందు సాయంవేళ సమయాన, మిగిలిన కాలాల్లో అర్ధరాత్రి దాటిన తర్వాత లేదా తెల్లవారు ఝామున ఈ నక్షత్రం కన్పిస్తుంది. అరుంధతి నక్షత్రాన్ని చూడాలంటే జాగ్రత్తగా ఆకాశం వంక చూడండి. మార్కు ఆకారంలో నక్షత్రాలు ఉంటాయి. కచ్చితంగా కాకపోయినా దాదాపుగా ఆ ఆకారంలోనే ఉంటుంది. చిన్నపిల్లాడిని మార్కు గీయమంటే ఎలా గీస్తాడో అలా ఉండే సప్తర్షి మండలంలో పక్క పక్కనే ఉండే నక్షత్రాలే అరుంధతి వశిష్ఠులవారివి. అరుంధతి నక్షత్రం చిన్నగా ఉంటుంది. ఇది మహాపతివ్రతా శిరోమణి అరుంధతి నక్షత్రం పురాణ ఇతిహాసం.

ఢమరు బంధ కందము

– వల్లభవఝుల అప్పలనరసింహమూర్తి



కం. పటుతర నటనా కుశలత
నటశేఖరు ఢమరుమ్రోత నాదములెలయన్
నటు నిటు పటుతర జలముల
నిటలాక్షునిజటలు నెగసె నెమ్మది మురియన్

భావం : పటిష్టమైన నటనా కుశలత్వము గల నటశేఖరుడు ఢమరు వాద్యమున నాదములు (అ,ఇ,ఉణ్ణాది బీజములు) ఉద్భవమంది భూతలమున ప్రకాశింపగా, పటుతరములైన జలములు (మహావిష్ణు పాదోద్భవములు) నటు నిటు నిటలాక్షుని జటల ప్రవేశించి మురిగా గంగమ్మ తల్లి పరవళ్ళు త్రొక్కెను.

నవలా చక్రవర్తి 'కొవ్వలి'

– కృష్ణమోహన్, 9177797902

(జూలై 1 జయంతి సందర్భంగ ప్రత్యేక వ్యాసం మీకోసం)



ఆధునిక ఆంధ్ర వాఙ్మయంలో ఒక వినూత్న విప్లవాన్ని సాధించిన మహారచయిత శ్రీ కొవ్వలి లక్ష్మీనరసింహారావు. దాదాపు మూడుదశాబ్దాలకు పూర్వం వ్యావహారిక భాషలో రచనలు చేయటం మహాపాపంగా, భాషామతల్లికి ద్రోహం చెయ్యటంగా భావించ బడుతున్న రోజుల్లో, అందరికీ అర్థమయ్యే సులభశైలిలో, శుద్ధ వ్యావహారిక భాషలో నవలలు రచించి, సమాజంలోని కుళ్ళును, ఛాందస ఆచారాలను నిర్భయంగా తన రచనలద్వారా వెలుగులోకి తెచ్చి, పాఠకుల్లో నవచైతన్యానికి నాందీ ప్రస్తావన చేసిన సాటిలేని మేటి రచయిత శ్రీ కొవ్వలి.

1912లో తణుకులో లక్ష్మీనారాయణ, కాంతమ్మగార్ల కనిష్ఠ పుత్రుడుగా జన్మించారు కొవ్వలి. తండ్రి వృత్తిరీత్యా రాజమండ్రి లోవుండగా అక్కడే వారి జీవనయానం సాగింది. చిన్నవయసులోనే మాతృవియోగం సంభవించింది. అప్పటినుండి తండ్రే తల్లికూడా అయి పెంచారు. పూటకూటియింటి భోజనంతోనే పిల్లలను పెంచారాయన. కొవ్వలి అప్పగారు శ్రీమతి బాపయమ్మ పెద్దదైన తరువాత పూటకూటియింటి బాధ తప్పిందంటారు కొవ్వలి. ఆమె అత్తవారింటికి వెళ్లగానే మళ్ళీ పూటకూటియిల్లే ఆధారమయింది.

తల్లిలేని తనకు తండ్రి, అక్క గారాబంతో చదువు అబ్బలేదంటారు కొవ్వలి. చిన్న అక్క మాణిక్యమ్మగారి దగ్గరే పెద్దబాలశిక్ష చదివి పన్నెండవ యేట ఆరో తరగతిలో చేరారు. పదహారో సంవత్సరంలో స్కూలుఫైనల్ పరీక్ష వ్రాశారు. అప్పుడే ఆయన జీవితం ఒక విచిత్రమైన మలుపు తిరిగింది. సెలవులలో ఆయన వారి అక్కగారి ఊరు వెళ్ళారు. తోచక అక్కడి గ్రంథాలయానికి వెళ్ళి క్రమంగా అక్కడి పుస్తకాలన్నీ చదివేశారు. ఇలా ఉండగా ఒకరోజున ఒకామె ఒక మహాకవి వ్రాసిన కావ్యంలోని ఒక కాగితాన్ని చింపి కుఱ్ఱవాని మలం ఎత్తి పారేయడం ఆయన కంటపడింది. ఆయన మనసు ఆక్రోశించింది. ఏదో ఆవేదన, ఏదో చేయాలనే ఆకాంక్ష బయలుదేరింది. ఆ ఆవేదనతోనే ఆయన యిల్లు విడిచి సంచారానికి బయలుదేరారు.

మూడు, నాలుగు సంవత్సరాలపాటు కనబడినా పుస్తకు అల్లా చదవడం, ఏ తల్లయినా కనికరించి పెడితే తినడం, ఏ అరుగుమీదో నిద్రపోవడం ఇలా జరిగింది. లక్ష్యం, గమ్యం లేకపోవడంతో విసిగి మళ్ళీ తిరిగి యింటికి చేరుకున్నారు. తండ్రి సంతోషించి కోఆపరేటివ్ శిక్షణ ఇప్పించి ఉద్యోగంలో ప్రవేశ పెట్టాలనుకున్నారు. కాని కవి హృదయంగల కొవ్వలికి చదువుపై ఏమాత్రం ఆసక్తి లేదు. ఒక సుప్రభాత సమయాన ఆయన ఆవేదనకు సమాధానం దొరికింది. బోధివృక్షం క్రింద బుద్ధునికి జ్ఞానోదయ మైనట్లు కొవ్వలిలో కూడా విజ్ఞాన చంద్రికలు వెల్లివిరిశాయి.

కేవలం కొంతమందికి మాత్రమే అర్థయమ్యే భాషలో, ఎక్కువ వెలలో గ్రంథాలు వెలువడటంవలన అవి సామాన్యులకు అందుబాటులో ఉండేవి కావు. కావున సాహిత్య అజ్ఞానం అధికంగా ఉందనీ అందరికీ అర్థమయ్యే భాషలో, తక్కువ వెలకు పుస్తకాలు అందించాలనీ, అక్షరజ్ఞానం కలిగిన ప్రతి ఒక్కరు చదివేలా రచనలు సాగాలని ఆయన తలంచారు. ఫలితంగా ఆయన కలం చేతపట్టి కథలు వ్రాయటానికి పూనుకొన్నారు. ఆయన మొదట వ్రాసిన నవల 'పల్లెపడుచు'. ఇది నవల అనడంకంటే సాంఘిక, ఆర్థిక, రాజకీయ మైన మూడు పెద్దకథల సమహారంగ వచ్చింది. దానిని తన గురువుగారైన గరిమెళ్ల సత్యనారాయణగారికి చూపించారు. గురువు సై అనడంతో వాణీ గ్రంథమాల ద్వారా అది ముద్రితమైంది. దురదృష్టవశాత్తు అది పెద్దగా జనాదరణ పొందలేదు.

వ్యావహారిక – గ్రాంధిక భాషాసమరం ముమ్మరంగా సాగుతున్న రోజులవి. కొవ్వలిలో తాను చేస్తున్నది సరైనదా కాదా అని విచికిత్స బయలుదేరింది. పెద్దల సలహా అనివార్యమని తలంచి అప్పటికే తాను వ్రాసిన 'దాసీపిల్ల' నవలను శ్రీ చెళ్ళపిళ్ళ వెకంట శాస్త్రిగారికి పంపి అభిప్రాయాన్ని అర్థించారు. ఆయన 'అటువంటి రచనలు వ్యావహారిక భాషలోనే రావాలని, వేదానికి స్వరం ఎంత ప్రధానమో, భాషకు కూడా స్వరం అంత ప్రధానమనీ, కొవ్వలి రచనలో ఆ స్వరం తనకు కనిపించిందనీ, నిరాటంకంగా పురోగమించమనీ' ఆశీర్వదించారు. ఆ ఉత్తరం కొవ్వలికి వేయి ఏనుగుల బలాన్ని ఇచ్చింది. చెళ్ళపిళ్లవారి లేఖతో ఆ నవల వాణీ గ్రంథమాల ద్వారానే ముద్రితమయింది. ఆ తరువాత విడుదలయింది 'తానాజీ'. ఈ మూడు నవలలతో కొవ్వలికి తన రచనపై ఆత్మ స్థయిర్యం వచ్చింది.

ఆ రోజుల్లో రాజమండ్రిలో పెద్ద ప్రచురణకర్తలు కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్స్. తన రచనలు బాగా ప్రచారం కావాలంటే పెద్ద ప్రచురణకర్త ప్రోత్సాహం కావాలి. ఆ ఉద్దేశ్యంతో ఒక నవల పూర్తిచేసి కొండపల్లి వారికీయగా ఆయన దానిని పరిశీలించమని శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారికి పంపించారు. ఆయన 'భాషాద్రోహంచేసే యిటువంటి రచనలు ముద్రిస్తే వంశ నాశనం అవుతుందని' త్రిప్పి పంపారు. దానితో ఆయన ఆ ప్రయత్నం విరమించేరు. ఇంతలో సాహిత్య విప్లవానికి నాందిగ ఒక చిన్న సంఘటన జరిగింది. వీరాస్వామి అనే పోస్ట్‌మ్యాన్ ప్రతిరోజులాగే ఉత్తరాలు ఇవ్వడానికి వచ్చి, యథాలాపంగా అక్కడ పడివున్న కొవ్వలి నవల చదవడం ప్రారంభించాడు. ఉత్తరాలు సంగతి మరచి అతడు ఆ నవల చదవడం పూర్తయ్యేవరకు అక్కడినుంచి కదలలేదు.

సామాన్యుడి ఆసక్తిని గుర్తించిన కొండపల్లివారు ఆ నవలను 'ఫ్లవర్ గరల్' పేరుతో ముద్రించారు. ఆర్డర్ ఉన్నా లేక

పోయినా పుస్తక విక్రేతలందరికీ ఒక కాపీ శాంపిల్‌గా పంపించారు. ఇంకేముంది ఆర్డర్లమీద ఆర్డర్లు వచ్చిపడ్డాయి. ముద్రించిన పుస్తకాలు ఖర్చవడంతో వీరవెంకయ్యగారు కొవ్వలిని పిలిచి మరిన్ని నవలలుంటే తాను ముద్రిస్తానని ముందుకువచ్చారు. ఒక డజను రచనలకు ముందుగానే కొంత పారితోషికమిచ్చి పంపించారు.

కొవ్వలి తన రచనలు పాఠకులకు అందుబాటు ధరలో ఉంటేనే తాను వ్రాస్తానని, తన ధ్యేయం చదువను, వ్రాయను నేర్చిన ప్రతి పాఠకునికి, అందునా మధ్య తరగతి పాఠకునికి అందుబాటులో ఉండే వెలకు తన రచనలు ఉండాలని కోరారు. అందుకు కొండపల్లి వారు అంగీకరించారు. వందపుస్తకాలు పన్నెండున్నర రూపాయలకు అమ్మే రీతిగాను, కొవ్వలి తన రచనలు ఇతరులకు ఈయకుండా కొండపల్లి వారికే ఇచ్చే విధంగాను నిర్ణయం చేసుకున్నారు. దానితో యిక విరామం లేకుండా రచనా వ్యాసంగంలో మునిగిపోయారు. ఒక సంవత్సరంలోనే దాదాపు వంద రచనలు చేయగలిగారు.

ప్రతి రచన ఆనాటి సాంఘిక వాతావరణానికి దర్పణమైంది. సాంఘిక దురాచారాలు రూపుమాపటానికి, ప్రజలలో నవ చైతన్యం, నవోత్సాహం కలిగించడానికి కొవ్వలి అహోరాత్రులు కృషిచేశారు. వితంతువివాహాలు, బాల్యవివాహాలు, వయోవృద్ధ వివాహాలు, కుల,మత,వర్ణాంతర విభేదాలు ఒకటేమిటి, ఆనాడు దేశాన్ని పట్టి పీడిస్తున్న ప్రతి సాంఘిక సమస్యమీద ఆయన రచన సాగించారు. ఒక్కొక్క రచనతోపాటు పాఠకుల హృదయాలను ఆకట్టుకున్నారు. అనతికాలంలోనే ఆంధ్రుల అభిమాన రచయిత అయ్యారు. ఇతర ప్రచురణకర్తలు అధికంగా పారితోషిక మిస్తామని, తమకు రచనలు చేయమనీ అడిగారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మరో వంద రచనలు పూర్తయ్యేవరకు తాను కొండపల్లివారికే రచనలు చేస్తాననీ కొవ్వలి మాటకు కట్టుబడి ఉండిపోయారు.

రెండు సంవత్సరాల కాలంలో రెండువందల రచనలు పూర్తయ్యాయి. ఆంధ్రదేశమంతటా కొవ్వలి పేరు మారుమ్రోగింది. ముఖ్యంగా స్త్రీపాఠకుల సంఖ్య అధికమైంది. ఒక్క ప్రచురణ సంస్థనుంచేగాక, మరికొన్ని చోట్లనుండికూడా రచనలు వెలువడితే ఇంకా ఎక్కువ ప్రాచుర్యానికి వీలుపడుతుందని ఆశించారు కొవ్వలి. ఫలితంగా రౌతు బుక్‌డిపో, వెంకటేశ్వర పబ్లిషింగ్‌హౌస్, పాండురంగా బుక్‌డిపో, యస్ ఏ స్వామి అండ్ కంపెనీ, రాజమంద్రి, సరస్వతీ బుక్‌డిపో – విజయవాడ మున్నగువారు కూడా కొవ్వలివారి రచనలు ముద్రించారు. ఆరంభించిన మూడు నాలుగు సంవత్సరాల కాలంలోనే ఆంధ్రదేశమంతటా నవలల వర్షం కురిపించారు శ్రీ కొవ్వలి. అప్పటికి ఆశించిన ధ్యేయంలో మొదటి ఘట్టం పూర్తయింది.

పేరు రాగానే కొంతమంది ఈర్ష్యాళువులు ఆయనపై విషప్రచారం మొదలెట్టారు. దినపత్రికలలో కొవ్వలి రచనలను నిశితంగా విమర్శిస్తూ వ్యాసాలు వ్రాశారు. ఆయన సాహిత్యాన్ని, పాఠకలోకాన్ని అధోగతికి ఈడుస్తున్నారని దుమారం లేవదీశారు. ఆ దుమారం లేపినవారు కూడా సాటిరచయితలే కావడం విశేషం. కొంతకాలం ఆ విమర్శలను సహించిన కొవ్వలి చివరకు పత్రికద్వారానే వారికి సమాధానం ఇచ్చారు. దానితో ఆ విమర్శలను అంతటితో ఆపివేస్తున్నామని ఆ పత్రిక ప్రకటించి ఫుల్‌స్టాప్ పెట్టేసింది.

రచయితగా ఒక వినూత్న విప్లవాన్ని సాధించిన కొవ్వలి ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకున్నారు. 'పాఠకులకు నేను ఏమి అందజేశాను? వారిని విజ్ఞాన పథంవైపు ఎంతవరకు తీసుకు వెళ్ళాను?' అని ఆత్మావలోకనం చేసుకున్నారు. 'నాకంటూ ప్రత్యేకంగ కొంతమంది పాఠకులు ఏర్పడ్డారు. వారిని అంతవరకు తన రచనల ద్వారా కొంత అభివృద్ధిపథం వైపు పురోగమింపచేశాను. కనుక ఇకపై హృదయాన్ని ఆకట్టుకునే బరువయిన రచనలు చేయాల'ని సంకల్పించారు. ఆ నిర్ణయం ఫలితంగానే 'నీవే నాభార్యవు–నీవే నాభర్తవు', 'ఇంతి–చామంతి–పూబంతి', 'గంగ–యమున–సరస్వతి' వంటి జంటనవలలు (సీరియల్స్) పాఠకులక అందాయి.

శ్రీ కొవ్వలి పేరు ఇంటింటా వాడుకపేరయింది. సత్కాలక్షేపంతోపాటు, విజ్ఞానం, వినోదం, వికాసం కలగడంతో పాఠక లోకం అమితంగా ఆదరించింది. కొవ్వలి పుస్తకం చదవనిదే రైలు ప్రయాణం జరిగేది కాదు. తినుబండారాలతోపాటు కొవ్వలి పుస్తకాలను కూడా అమ్మేవారు. 'రైల్వే సాహిత్యం' అని చులకనచేసిన ప్రబుద్ధులు లేకపోలేదు. నాలుగువందల పుస్తకాలు పూర్తిచేసేసరికి కొవ్వలి వయస్సు 25 సంవత్సరాలే. పాఠకులనుండి అసంఖ్యాకంగా ఉత్తరాలు వస్తూండేవి. అందులో అధికంగా స్త్రీపాఠకులవే. ప్రతి అభిమానికి ఎంతో ఓపికగా సమాధానం వ్రాసేవారు కొవ్వలి. సాహిత్యంలోవున్న సంబోధనలన్నిటితో తమ ప్రణయాన్ని, బాధలను ప్రకటించుకునేవారు. ఇంతకూ తన నవలలో విభిన్న స్త్రీపాత్రలను సృష్టించిన కొవ్వలి స్త్రీలకు చాలా దూరంగా ఉండేవారు.

ఆయన జీవితంలో జరిగిన ఒక సంఘటన చెప్పక తప్పదు. ఆయన రోజూ సాయంత్రం గోదావరి గట్టుకు షికారు వెళ్ళేవారు. వంతెన దగ్గర లైబ్రరీ ఉండేది. అక్కడ కాసేపు కూర్చుని యింటికి తిరిగి వచ్చేవారు. ఇంతలో ఒక కుఱ్ఱవాడు వచ్చి ఆ పక్కయింటిలో ఆమ్మాయి రోజూ మిమ్మల్నే చూస్తోందని చెప్పాడు. కొవ్వలి ఆ కుఱ్ఱవాణ్ణి మందలించి పంపేశాడు. మరునాడు వర్షం రావడంతో, ఆ ప్రదేశమంతా నీళ్ళతో నిండిపోయింది. ఆ నీళ్ళను దాటుకుని వెళ్ళాలంటే ఆ కుఱ్ఱవాడు చెప్పిన యింటిమీదుగానే వెళ్ళక తప్పదు. అలా వెళుతూ, యథాలాపంగా యింటిలోపలికి చూశారు. చిరునవ్వులు చిందించే అందమైన యువతి అమాంతం చేయి పట్టుకుని లోపలికి లాగి తలుపు మూసింది. ఈ హఠాత్సంఘటన కొవ్వలిలో భయాన్ని, ఆశ్చర్యాన్ని రేకెత్తించాయి. అంతవరకు ప్రేమలేఖలు చూడడం తప్ప, అటువంటి సంఘటన ఎదుర్కొనే పరిస్థితి రాలేదు. ఆమెకు నీతి బోధించి బయటపడ్డం గగనమైంది.

30 సంవత్సరాలు పూర్తయేసరికి ఆరువందల రచనలు పూర్తయ్యాయి. తెలుగునాట కొవ్వలిపేరు రామనామంలా వ్యాప్తి చెందింది. దూషణ భూషణ తిరస్కారాలు మనిషన్నాక తప్పవు. పొగిడినప్పుడు మిడిసిపడలేదు, తెగిడినప్పుడు బాధపడలేదు. తాను నమ్మిన ధ్యేయంవైపు పురోగమించారు కొవ్వలి.

ప్రాదేశిక జ్ఞానం

– వేమూరి వెంకటేశ్వరరావు, కేలిఫోర్నియా

ఇంగ్లీషులో domain knowledge అనే పదబంధం ఉంది. దీనిని ప్రస్తుతానికి ప్రాదేశిక జ్ఞానం అని అందాం.

ఉదాహరణకి మనం గణితం గురించి తెలుగులో వ్రాస్తున్నామనుకుందాం. గణితంలో పాండిత్యం లేకుండా గణితం గురించి తెలుగులోనే కాదు, ఏ భాషలోనూ వ్రాయలేము. ఈ సందర్భంలో గణితంలో ఉన్న జ్ఞానాన్ని ప్రాదేశిక జ్ఞానం అంటారు. ఇదే విధంగా వ్యాకరణం గురించి తెలియకుండా వ్యాకరణం గురించి వ్రాయలేము.

ప్రస్తుతానికి మనకి ఒక విషయంలో ప్రాదేశిక జ్ఞానం ఉందనుకుందాం. ఈ జ్ఞానాన్ని వెలిబుచ్చటానికి ఒక భాష అవసరం. ఈ సందర్భంలో భాషని మాధ్యమం(medium) అంటారు. మనకున్న ప్రాదేశిక అవగాహనని ఒక భాషా పరంగా వ్యక్తపరచాలంటే ఆ భాషమీద మనకి ఆధిపత్యం ఉండాలి. లేకపోతే మన మనస్సులో ఉన్న భావం ఒకటి, బహిర్గతమయ్యే భావం ఇంకొకటి అయి అపార్థాలకి దారితీస్తుంది.

ప్రస్తుతం సైన్సుని తెలుగులో వ్రాయాలనే ప్రయత్నం చేస్తున్నాం కదా. ఈ ప్రయత్నం చేసేవారికి సైన్సుమీదా పట్టు ఉండాలి, అలాగే భాషమీదా పట్టు ఉండాలి. కనుక సైన్సులో పదజాలం సృష్టించాలన్నా, పుస్తకాలు వ్రాయాలన్నా ఆ పనిని తెలుగు పండితులకి పురమాయించటం శుష్క దండుగ. ఈ వాదానికి బొరుసు కూడా ఉంది. సైన్సు వచ్చినవాళ్ళంతా వారికి తెలిసిన విషయాలని ఇతరులకి అర్థమయ్యే రీతిలో చెప్పలేరు, వ్రాయలేరు ఏ భాషలోనైనా సరే. పైపెచ్చు మన దేశంలో ఇంగ్లీషు వ్యామోహంలో పడ్డవారిలో కొందరు కొద్దిగానో, గొప్పగానో ఇంగ్లీషులో వ్రాయగలరేమో కాని తెలుగులో బొత్తిగా వ్రాయలేరు.

సైన్సు వరకు ఎందుకు? ఉదాహరణకి అడివి బాపిరాజు వ్రాసిన తెలుగు గురించి విచారిద్దాం. ఈయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఈయన వ్రాసిన నారాయణరావు తెలుగు నవలల్లో ఉన్నత స్థాయి నవల. ఈయన వ్రాసిని హిమబిందు అనే మరో నవలని సమీక్షిస్తూ తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు బాపిరాజుకి వైదిక మత విషయాలలో ప్రాదేశిక అవగాహన సరిగ్గా లేకపోవటం వల్ల జరిగిన ఒక వ్యాకరణ దోషాన్ని ఎత్తి చూపుతారు. అంటే ఈ విమర్శకుడి దృష్టిలో బాపిరాజుకి వైదిక మత విషయాలలో ప్రాదేశిక జ్ఞానం లోపించింది.

ఈ విమర్శకి కారణం హిమబిందు నవల నాల్గవ భాగంలో, పదవ అధ్యాయంలో బాపిరాజు వాడిన 'జ్ఞానయుద్ధం' అనే సమాసం. ఆలోచించండి – జ్ఞానయుద్ధం అంటే ఏమయి ఉంటుంది? జ్ఞానంతో చేసిన యుద్ధమా? జ్ఞానం వలన చేసిన యుద్ధమా? జ్ఞానమనే యుద్ధమా?

ధర్మయుద్ధం అనే పదబంధం ఉంది. ధర్మాన్ని నిలబెట్టడానికి చేసిన యుద్ధమా? యుద్ధ నియమాలని పాటిస్తూ చేసిన యుద్ధమా? 'యుద్ధం చేయటం నా ధర్మం' అన్న నమ్మికతో చేసిన యుద్ధమా? 'ధర్మయుద్ధం' అన్న పదబంధం మనకు అలవాటైనది. 'మహాభారత యుద్ధం ధర్మయుద్ధమా కాదా?' వంటి ప్రయోగాలు మనకి పరిచితాలే. కనుక ధర్మయుద్ధం అంటే ఏమిటని తికమక పడం. కానీ జ్ఞానయుద్ధం అన్నది మనకి పరిచయం లేని పదబంధం. అందువల్ల హిమబిందులో జ్ఞానయుద్ధమన్న పదబంధం అర్థవంతంగా లేదని ఈ విమర్శకుడు అభిప్రాయపడ్డాడు. విమర్శకుని మాటలలోనే 'జ్ఞానయుద్ధమనగా నేమి? తత్పురుషయా? కర్మధారయమా? ద్విగువా? బహువ్రీహియా? ద్వంద్వమా? అవ్యయీభావమా? అలుక్సమాసమా?

ద్విపద, బహుపద, ద్విపదసమాహార, బహుపదసమాహార భేదములతో ఉన్న ద్వంద్వ సమాసం కాదు. సామాన్య, సమాహార, సంఖ్యోదయ, తద్ధితార్థ భేదములతో ఉన్న ద్విగు సమాసం కాదు. బహువ్రీహి సమాసం అనుకుందామా? ద్వితీయాది సప్తమీ విభక్తి పర్యంతమైన ద్విపద బహువ్రీహి కాజాలదు. క్రియా విశేష బహువ్రీహి కాదు. బహుపద బహువ్రీహి కానీ, సంఖ్యోభయపద బహువ్రీహిగాని, సంఖ్యోత్తరపద బహువ్రీహి కాని, సహపూర్వపద బహువ్రీహి కాని, వ్యతిహార లక్షణ బహువ్రీహి కాని, దిగంతరాల లక్షణ బహువ్రీహి కాని, ఉపమాన పూర్వపద బహువ్రీహి కాని కాజాలదు.

తత్పురుష అనుకొందామా? జ్ఞానము యుద్ధమునకు అనే విగ్రహము కుదరదు. కావున ఇది ప్రథమా తత్పురుష కాజాలదు. జ్ఞానమును దాటిన యుద్ధమునకు అనే విగ్రహ వాక్యం కూడా నప్పదు. కనుక ద్వితీయా తత్పురుష కాజాలదు. జ్ఞానము చేత యుద్ధము అని అన్వయము చెప్పుకుని ఇది తృతీయా తత్పురుష అని సరిపెట్టుకోవచ్చు. ఇదే విధంగా చతుర్థాది సప్తమీ తత్పురుష వరకూ ఇది కాజాలదు.

దీనియందు విశేషణమే లేదు. కాబట్టి విశేషణ పూర్వపద, లేక విశేషణోత్తరపద, లేక విశేషణోభయపద కర్మధారయ సమాసం కాదు. ఉపమానము కాదు కాబట్టి ఉపమాన పూర్వపద, లేక ఉపమానోత్తరపద కర్మధారయము కాదు. ఇలా విశ్లేషణ చేసి తృతీయా తత్పురుష అని సర్దుకుందామా అంటే, జ్ఞానముచేత యుద్ధం అనగా నేమి? జ్ఞానమనగా నేమియో తెలిసిన వారట్లనరాదు.

ఇదీ విమర్శకుడి కోణం. Intellectual dispute అని కాని dogmatic dispute అని కాని బాపిరాజుగారి భావము అయి ఉండవచ్చు. ఆయన అసలు మనోభావం ఏమిటో మనకు తెలియదు.

ఒక ఉదాహరణ ఎందుకు ఎత్తి చూపించానంటే ఏ విషయం వ్రాసేటప్పుడైనాసరే వ్రాయబోయే అంశంమీదా, వాడదలచుకున్న మాధ్యమంమీదా రచయితకి అధికారం ఉండాలి. ఇటువంటి అధికారం లేకుండా నిఘంటువులు నిర్మించినా, సందర్భశుద్ధి లేకుండా క్రొంగ్రొత్త పదప్రయోగాలని పుంఖానుపుంఖాలుగా పాఠకులమీదకి గుప్పించినా అది శుష్క ప్రయోగమే అవుతుంది.

అపర ధన్వంతరి 'ఎల్లాప్రగడ'

-జి. శ్రీలత రమేశ్

బీదరికంలో పుట్టి అకుంఠిత దీక్షతో భీమవరం నుండి బోస్టన్ చేరి జీవితాన్ని వైద్య పరిశోధనలకు అంకితం చేసిన తెలుగుబిడ్డ ఎల్లాప్రగడ సుబ్బారావు. ఎన్నో వ్యాధులకు దివ్యమైన ఔషధాలను కనిపెట్టిన అపర ధన్వంతరి ఆయన. 1895 జనవరి 12న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆయన జన్మించారు. తండ్రి జగన్నాథం రెవెన్యూ ఇనస్పెక్టరుగా పనిచేస్తూ ముందుగానే పదవీవిరమణ చేయడంతో ఇల్లు గడవడం కష్టంగానే ఉండేది. ఇలాంటి ఆర్థిక పరిస్థితిలో సుబ్బారావు తరచుగ పాఠశాలకు వెళ్ళలేకపోయేవాడు. కాశీలో తీర్థయాత్రికులకు అరటిపండ్లు అమ్మితే లక్షల రూపాయలు సంపాదించవచ్చని ఎవరో చెబితే విని 13 ఏళ్ళ వయసులో బంధువుల కుర్రాడితో కలిసి పారిపోయేందుకు ప్రయత్నించారు. తల్లి ఆ విషయం పసిగట్టి ఆ ప్రయత్నాన్ని విరమింప జేసింది. 1911లో మెట్రిక్యులేషన్ పరీక్షలో సుబ్బారావు రెండుసార్లు ఫెయిల్ అయ్యారు. తల్లిమాత్రం పట్టువిడవకుండా ఎంతో కష్టపడి మద్రాసులోని హిందూ స్కూలుకు ఆయనను పంపింది. 1913లో తండ్రి చనిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఇంకా ఎక్కువయ్యాయి. కుర్రాడి చదువు ఆగిపోకూడదని తల్లి తన పుస్తెలతాడును విక్రయించి డబ్బును సమకూర్చింది. ఈ సంఘటనతో చలించిపోయిన సుబ్బారావు తన జీవితంలో ఎన్నడూ మళ్ళీ పరీక్ష తప్పలేదు.

గణితంలో డిస్టింక్షన్ సాధించడంతో ఆ అంశంలో 'ఆనర్స్' చేయమని అందరూ ప్రోత్సహించినా సుబ్బారావు మాత్రం మెడికల్ కాలేజీలో చేరాడు. సన్యాసిగా మారి రామకృష్ణామిషన్‌లో వైద్యసేవలు అందించాలనేది ఆయన ఆశయం. కానీ అందుకు తల్లి అనుమతి ఇవ్వలేదు. సుబ్బారావు హఠాత్తుగా 'స్ప్రూ' (ఆహారనాళాల పుండు) వ్యాధి బారిన పడ్డారు. ఆ కాలంలో ఈ వ్యాధి వచ్చినట్లయితే బ్రతకడమే కష్టం అనేవారు. సుబ్బారావు ఆయుర్వేదమందులతో ఎలాగో ఒకలా వ్యాధినుండి బయటపడ్డారు. 1919 మే 10న 12 ఏళ్ళ కస్తూరి శేషగిరితో సుబ్బారావుకు వివాహమైంది.

స్వదేశంపై ఉన్న మమకారంతో విదేశీ దుస్తులను బహిష్కరించి ఖద్దరుతో కాలేజీకి వెళితే శ్వేతజాతీయుడైన సర్జన్ సుబ్బారావుపై మండిపడేవాడు. అన్నిట్లో మంచి మార్కులతో పాసైనప్పటికీ సర్జరీలో మాత్రం బొటాబొటీ మార్కులు వేశారు. దీంతో ఎంబిబిఎస్ డిగ్రీ కాకుండా అంతకన్నా తక్కువదైన ఎల్.ఎం.ఎస్ సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఆ కాలంలో పైచదువులకి బ్రిటన్ వెళ్ళాలన్న భావన భారతీయుల్లో ఉండేది. బ్రిటన్ వాళ్ళంటే నచ్చని సుబ్బారావు అమెరికా వెళ్ళాలని భావించారు. ఇందుకోసం హార్వర్డ్ మెడికల్ కాలేజికి ఆయన లేఖ వ్రాయడంతో సానుకూల స్పందన వచ్చింది. కానీ చేతిలో డబ్బులు లేవు. వారంరోజుల తేడాతో తన ఇద్దరు సోదరులు 'స్ప్రూ' వ్యాధితో మరణించడంతో సుబ్బారావు మనసు తీవ్రంగా కలతచెందింది. ఎలా అయినా ఈ వ్యాధికి మందు కనుగొనాలనే పట్టుదల ఆయనలో పెరిగింది.

కాకినాడలోని ఒక సంస్థ ఆదుకోవడంతో 1923 సెప్టెంబరులో అమెరికాకు ప్రయాణమయ్యారు. భీమవరం నుంచి బోస్టన్ వెళ్ళిన సుబ్బారావు మళ్ళీ భారతావనిపై అడుగుపెట్టలేదు. నిరంతరం వైద్య పరిశోధనలోనే ఉండి ఎల్లలు సైతం మర్చిపోయారు. భార్య శేషగిరి మగబిడ్డను ప్రసవించగా 'స్ప్రూ' వ్యాధి కారణంగా ప్రాణం నిలువలేదు. ఆ తర్వాత సుబ్బారావు ఈ వ్యాధికి వ్యాక్సిన్‌ను కనుగొన్నారు. అమెరికాలో అడుగుపెట్టే సరికి తన దగ్గరున్న డబ్బంతా అయిపోయింది. దీంతో సుబ్బారావు బోస్టన్‌లోని ఒక ఆస్పత్రిలో పారిశుధ్య పనులను చేసేందుకు సైతం వెనుకాడలేదు. రాత్రంతా ఆస్పత్రిలో పనిచేస్తూ, పగలంతా కాలేజిలో చదువుతూ ఎదిగిన వ్యక్తి ఆయన. ప్రతిభతో ప్రొఫెసర్ల మెప్పు పొందుతూ స్కాలర్‌షిప్ సాధిస్తూ పరిశోధనలను సాగించారు. డా.ఫిస్కే సహాయంతో శరీరకణాలలోని భాస్వరాన్ని సరిగ్గా, తేలిగ్గా నిర్ధారణ చేసే 'రేపిడ్ కెలరోమెట్రిక్ మెథడ్'ను ఆవిష్కరించి 1924లో తొలిసారిగా ప్రపంచానికి పరిచయమయ్యారు.

ఇదే 'ఫిస్కే సుబ్బారావు' పద్ధతిగ పేరొందింది. ఆ తరువాత శరీరంలోని కండరాల శక్తికి మూల పదార్థం 'అడినోసిస్ ట్రై ఫాస్ఫేట్' అని నిర్ధారించి జీవరాశి భౌతిక ప్రక్రియలను నిర్ణయించేది ఇదేనని వెల్లడించారు. దీంతో 1922లో నోబుల్ బహుమతి పొందిన శాస్త్రవేత్తల పరిశోధనల ఫలితాలు సైతం తప్పని ఋజువైంది. అయినా ఆయనకు నోబెల్ బహుమతి రాలేదు. తన పరిశోధనల్లో అతి ముఖ్యమైన 'స్ప్రూ' వ్యాధిని అరికట్టే ఫోలిక్ యాసిడ్ విటమిన్‌ను కనుగొనడం, బోదకాలు, ఇసినోఫీలియా వంటి వ్యాధులకు ఉపయోగపడే 'హైట్రాజన్', క్షయవ్యాధి నివారణగా పేర్కొనే 'ఇనోనెక్'తోపాటు కలరా, టైఫాయిడ్, ప్లేగు, అతిసార వంటి వ్యాధులకు దివ్య ఔషధంగా ఉపయోగపడే 'టెట్రాసైక్లిన్' యాంటీ బయొటిక్‌తో పాటు పిల్లల్లో బ్లడ్‌కాన్సర్‌ను అరికట్టే 'మెథాట్రెక్సేట్', అరియోమైసిన్ వంటి ఔషధాలు సుబ్బారావు పరిశోధనల ఫలితాలే. ఎన్నో పరిశోధనలు చేసినా అవార్డుల కోసం ఆయన ఏనాడు ఆరాటపడలేదు. 'లేడర్లే' సంస్థ సుబ్బారావును తమ డైరెక్టర్‌గా నియమించుకుంది. ఆయన జీవితంలో ఆఖరిక్షణంవరకూ ఆ సంస్థలోనే కొనసాగి ఎన్నో పరిశోధనలు చేశారు. కొన్ని యాంటీ బయోటెక్‌లకు సుబ్బామైసిన్, సుబ్బరోమైసిన్ అనీ లేడర్లే సంస్థ పేర్లు పెట్టుకుంది. 1948 ఆగష్టు 9న గుండెపోటుతో సుబ్బారావు కన్నుమూశారు. అమెరికా పత్రికలు ఆయనను ఎంతగానో కీర్తిస్తే, భారతీయ పత్రికలు మాత్రం తగిన గౌరవం ఇవ్వలేదు.

మనువు చెప్పిన మాట

- రోచిష్మాన్, చెన్నై

జన్మనా జాయతే శూద్రః – సంస్కారాత్ ద్విజ ఉచ్యతే!
విద్యయా యాతి విప్రత్వమ్ – బ్రహ్మ జ్ఞానాత్ బ్రాహ్మణః!!

పుట్టుకచేత మనుష్యులు సామాన్యులుగానే (శూద్రులుగానే) పుడతారు. సంస్కారంవల్ల రెండవ జన్మను (ద్విజుడు) పొందుతారు. విద్యవల్ల (జ్ఞానం) విప్రత్వం సాధించుకుంటారు. వారికే బ్రహ్మ జ్ఞానం వల్ల బ్రాహ్మణత్వం సిద్ధిస్తుంది.

దీనినిబట్టి ఈనాటి మన కులవ్యవస్థకు మనువు మూలము, కారణము కాదు. మన దేశంలో నేడు మూడు వేలకు పైగా కులాలు ఉన్నాయి. నిజానికి వేరు వేరు పేర్లతో అన్ని దేశాలలోను, ప్రతి మతం ఖాతాలోను ఈ హెచ్చు తగ్గుల తెగల విభాగం, వివక్ష ఉంటూనే ఉన్నాయి. ఇక్కడ మనువు చెప్పింది మనుషుల్లోని నాలుగు రకాలను మాత్రమే. మూడు వేల పైచిలుకు కులాలో, ఇంకేవో వ్యత్యాసాలో అవి మనువు చెప్పినవి కానే కావు.

ఇప్పుడున్న కులాలకు, సనాతన ధర్మానికి సంబధించిన ఏ మూల రచనలలోను ఏ ఆధారాలు లేవు. పుట్టుకతో అందరూ శూద్రులే అన్నారంటే అందరూ సామాన్యులే అని అర్థం. సంస్కారం లేదా సంప్రదాయం ప్రకారం జరిగే ప్రక్రియవల్ల ద్విజులవుతారనీ (క్రిస్టియానిటీలో జరిగే బాప్టైజేషన్‌లాగ), విద్యవల్ల విప్రులవుతారనీ (అంటే విద్యావంతులు లేక విద్వాంసులు), బ్రహ్మ జ్ఞానంవల్ల అంటే పరమాత్మకు సంబంధించిన జ్ఞానంవల్ల (రమణమహర్షి, రామకృష్ణ పరమహంస, జీసస్, మహమ్మద్ నబీ, బయాజిద్ వంటి పరమాత్మ లేదా అల్లాహ్ లేదా ఆల్ మైటీలను తెలుసుకున్నవాళ్ళు) బ్రాహ్మణులవుతారనీ మాత్రమే మనువు చెబుతున్నాడు.

జీసస్, మహమ్మద్ నబీలకు పరమాత్మ జ్ఞానం ఉందని మనం తీసుకుంటే మనువు మాట ప్రకారం (బ్రహ్మజ్ఞానం వాళ్ళకు ఉన్నది కాబట్టి) వాళ్ళు బ్రాహ్మణులే. మనువు కాలానికి హిందూ మతమో మరో మతమో లేదు. మనువు కాలానికి భారత దేశంలో మతమన్నదే పుట్టలేదు. మన కులవ్యవస్థకూ, కులవివక్షకూ మనువుకు ఏసంబంధమూ లేదు. మహాభారత కాలంవరకూ కులమన్న పదం వంశం అన్న అర్థాన్నే సూచించింది.

కులం అన్న పదం ఈనాటి సామాజిక అవలక్షణమైన విభాగాలకు, వివక్షకు సంబంధించినది కాదు. మనుస్మృతిని సరిగ్గా చదవడం నేర్చుకుంటే మన భ్రమలు, అపోహలు తొలగిపోతాయి. భాషను, భావాన్ని సరిగా అర్థం చేసుకుంటేనే చదివేవారికి సరైన అవగాహన వస్తుంది. అది చేయవలసిన పని, అంతేకాని మనకు తోచిందే తడవుగ నోటికివచ్చింది మాట్లాడితే మన మూర్ఖత్వమే మిగులుతుంది. అందుకని తెలివిడితో అసత్యాలను, అపార్థాలను తొలగించుకుందాం. 'సర్వే జనాః సుఖినో భవంతు' అందాం.

చారిత్రక విస్మయం

మామూలుగా నేటి చదువులు చదువుకున్న ఎవరినైనా మొగలాయి చక్రవర్తులు ఎవరని అడిగి చూడండి. వందమందిలో తొంభైతొమ్మందుగురు వరకు బాబరు, హుమయూన్, అక్బరు, జహంగీరు, షాజహాను, ఔరంగజేబు అని వంశానుక్రమం మొత్తం చెబుతారు. అది వారు చిన్నప్పటినుంచి కంఠతః చదువుకున్న చదువు మరి.

250 సంవత్సరాలు పరిపాలించిన ఈ వంశం గురించే ఇంత బాగా చెప్పారుకదా అని మనకి స్వర్ణపాలన నందించిన ప్రాచీన రాజుల గురించి, వారి చరిత్ర గురించి మీకు ఏమైనా తెలుసా! అని అడిగామనుకోండి. వెంటనే వాళ్ళు ఖంగు తినడం ఖాయం. ఎందుచేతనంటే వారు ముస్లిముల చరిత్ర గురించి, బ్రిటిషు పాలన గురించి చదువుకున్నారు కాని భారతీయ చక్రవర్తుల చరిత్ర ఏమిటో వారు చదువుతే కదా వాళ్ళకి తెలిసేది!

పవిత్రమైన మన భారతదేశాన్ని పరసాలించిన మహా శౌర్యవంతులైన చక్రవర్తుల పరిసాలనా కాలంగురించి మనం తెలుసుకోవడం చాలా అవసరం. మన చరిత్ర మనకి తెలియక పోవడంచేతనే పాశ్చాత్య నాగరికతయే గొప్పదని భావించి దానిని అనుసరించడానికి మనం బానిసలమవుతున్నాం.

మన దేశాన్ని మౌర్యులు 550 ఏళ్ళు పరిపాలించారు. శాతవాహనులు 500 ఏళ్ళు, గుప్తులు 400 ఏళ్ళు, పాండ్యులు 800 ఏళ్ళు, చోళులు 1,000 ఏళ్ళు, పల్లవులు 600 ఏళ్ళు, చాళుక్యులు 600 ఏళ్ళు, ఈశాన్య భాగాన అహోం రాజులు 650 ఏళ్ళు సుదీర్ఘకాలం ఈ దేశాన్ని పాలించారు.

ఇంత సుదీర్ఘకాలం మనల్ని పరిపాలించిన మహనీయులైన చక్రవర్తుల విషయం వందమందిలో ఒక్కడు కూడా వంశక్రమాన్ని ప్రక్కనబెట్టి కనీసం ముగ్గురేసి చక్రవర్తుల పేర్లయినను చెప్పలేరు. ఇంతటి తార్కాణం ఎదురుగా ఉండగా మన ప్రసిద్ధ చరిత్రకారులు నిజమైన భారతదేశ చరిత్రను దాచి, ధ్వసం చేశారన్నది సత్యం.

ఒక్కసారి మన బాల్యం గుర్తుచేసుకుంటే 6వ తరగతి చరిత్ర పుస్తకంలో ఈ వంశాల చరిత్ర ఉంది. ఏడో తరగతిలోకి వచ్చేసరికి మొగలాయీ చక్రవర్తుల గురించి ఏకంగా ఒక్కో అధ్యయం కేటాయించేసేరు. వారిని తనివితీర పొగుడుతూ అనేకమైన అభూత కల్పనలను అందులో జోడించేసేరు. ఒక్క ఉదాహరణ చూడండి. ఘోరీ ఎన్ని సార్లు ఓడిపోయాడో ఎప్పుడూ చెప్పరు. ఎన్నిసార్లు దండయాత్ర చేశాడో అది చెబుతారు. అలాగే గజనీ దండయాత్రలు చెబుతారు కాని వచ్చిన ప్రతిసారి వాడు ఓడి పారిపోయాడని మాత్రం చెప్పరు. వారు చేసిన అరాచకాలను గురించి మనకు తెలియనివ్వరు. లౌకికవాదం పేరుమీద భారత చరిత్ర వంచింపబడింది, వక్రింపబడింది. మన వైభవం తెలుసుకోవాలి.

చలం రచనల్లో స్వేచ్ఛ

– జయసూర్య, 9440664610

జీవితం–సాహిత్యం ఒకటిగా ఆరు దశాబ్దాలు పైగా తెలుగు సమాజాన్ని శాసించి, నిరంతరం సంఘర్షణ, అశాంతి, తపన, అన్వేషణా పథగామిగా ప్రభావితమైన చలం జన్మించి 125 సంవత్సరాలు కాగా, లోకాన్ని వదలి 40 ఏళ్ళయింది. 85 సంవత్సరాల జీవనయానంలో నిరీశ్వర, ఈశ్వర వివాదాస్పద వైరుధ్య వైవిధ్యంగా జీవితానందపు లోలోతుల్ని అన్వేషించటమే జీవనలక్ష్యంగా సంచలనం సృష్టించిన గుడిపాటి వెంకటచలం భారతీయ జీవన సాహిత్యసీమలో అరుదైన, అపురూప సామాజిక తత్త్వవేత్త. ఆస్తిక, నాస్తిక వాదాల రెండింటితో అవిశ్రాంతంగా దేనికీ తలవంచకుండా నిష్కల్మష, నిర్మొహమాట వ్యక్తిత్వంతో పోరాటంలో చలం తనను తాను అనుభూతి మార్గాన్వేషణలో వెలుగుకోసం వెతుక్కుంటూ నడవటం, సాహిత్యపు వెలుగు దివిటీ ప్రసరింప చేయటం కారణంగా కాలాతీతమైన అజరము కీర్తి సాధించారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో మూడు దశాబ్దాల కాలం చలం జీవనం గమ్యం నాటిరోజులలో సనాతన సమాజం, స్త్రీల జీవితాలకు తొడిగే ఇనుప కచ్చడాలను ఛేదించే లైంగిక కట్టుబాట్లు, స్వేచ్ఛకోసం పోరాటంగా కొనసాగింది. కందుకూరి, గురజాడ అప్పటికే అందించిన ఆయుధం చలం చేతిలో కొరడా అయింది. సూటిగా హృదయాలను స్పృశించే భావతీవ్రత, నిజాయితీతో నిలదీసి ప్రశ్నించే పదునైన శైలి, తాను ప్రగాఢంగా విశ్వసించిన తిరుగుబాటు ధోరణులు చలాన్ని కదిలించాయి. చలం సున్నిత హృదయాన్ని ఆమె ఈ భూమిమీదనే అమృతంతో నింపగల స్త్రీ అనుభవిస్తున్న వేదన, సంఘర్షణ, దుర్నీతి కదిలించింది. 'ఆమె' కన్నీళ్ళు కలలు ఊపిరాడనీయలేదు. సంఘం వెలివేసింది. ఒంటరి పోరాటంలో 'ఆమె' స్వేచ్ఛ ప్రాతిపదికగా శారీరక, మానసిక అణచివేతపై చలం సృష్టించిన సాహిత్యం నాటి సమాజాన్ని నిలదీసింది. కుటుంబ వ్యవస్థలో చిచ్చు రగిల్చే అనైతిక సాహిత్యంగా ముద్రపడింది. అపకీర్తి, తీవ్ర నిందారోపణలు మూటకట్టుకున్న చలం ఎవరికీ, ఎన్నడూ తలవంచలేదు, రాజీపడలేదు.

సంచలనాత్మక సాహిత్యం : చలం స్త్రీత సమస్యలతోపాటు తన కాలంనాటి సమాజంలోని ఎన్నో విషయాలను తన రచనలలో ప్రస్తావించారు. పిల్లలను కొడితేకాని నాలుగక్షరం ముక్కలు రావని నమ్మే రోజులు కావడంతో తండ్రుల దండన, హింస చలం పసి హృదయంపై చెరగని ముద్రవేసి 'బిడ్డల శిక్షణ' వ్రాయించింది. 'మ్యూజింగ్స్'లో పిల్లల చదువులూ, పరీక్షలు, హింసలు వివరించారు. ఉపాధ్యాయునిగా, పాఠశాలల తనిఖీ స్కూళ్ళ ఇనస్పెక్టరుగా విద్యార్థులలో పోటీతత్వం నిరసిస్తూ విద్యావ్యవస్థలో అవలక్షణాలను దుయ్యబట్టారు. 'కుర్రాళ్ళు పరీక్ష వ్రాస్తుంటే కాపలా కూర్చోవటంలో నీచత్వం స్ఫురిస్తోంది' అంటారు మ్యూజింగ్స్‌లో. సుఖవంతమైన జీవితం అంటే ఒంటినిండా బంగారం, ఇంటినిండా అధునాతన సామగ్రితో బ్రతకటం అనే భావం నాడూ నేడూ స్థిరపడింది. వాటిని అందుకోవటానికే చదువుల్లో ర్యాంకుల కోసం, జీతాలు బాగా వచ్చే ఉద్యోగాలకోసం వెంపర్లాట. ఇది పిల్లలలో మానసిక ఒత్తిడికీ, ఆందోళనకు దారితీస్తోంది. ఈ పరిస్థితి మారాలి. 'సింపుల్‌గా సుఖపడటం నేర్వాలి విద్య' అన్నారు ఆనాడే చలం.

చలం చిరంతన అన్వేషి. సున్నిత హృదయుడు. పురుషాధిక్యత మరింతగా సమాజాన్ని ఏలుతున్న రోజులలో 'ఆమె' స్వేచ్ఛ ప్రధాన అంశంగా తన రచనలలో ప్రశ్నించారు. ఈ ప్రపంచం ఇవ్వగల సుఖాలన్నిటిలోనూ అత్యంత ఆకర్షణీయమైన లైంగిక స్వేచ్ఛకు ఘోరత్వం, నీచత్వం ఆపాదించి అణచివేయటంపట్ల ఎన్నో నవలలు, కథలు, రూపకాలు, లేఖలులో కఠోర వాస్తవాలను చిత్రించారు. తన బ్రతుకంతా తెలుగు నేలపై అక్షరాల సొగసు, సౌందర్యంతో, భావోద్వేగంతో ప్రతీ అంశంలో కల్మషం పోగొట్టే, స్వచ్ఛ జీవనమాధుర్యం ఆశించారు. ఇలాంటి సత్యాన్వేషణ ఒకపట్టాన లోకానికి ఆమోదయోగ్యం కాదు. అర్థం అవటం కూడా అంత తేలిక కాదు. చలం భావజాలం, రచనల తీరుతెన్నులు సమాజాన్ని మేల్కొలిపే వైతాళిక అంతరార్థాలు కుహనా ఆధ్యాత్మికతను, అశాస్త్రీయ మూఢ విశ్వాసాలను చెంపపెట్టుగా పరిణమించాయి. సత్యాన్వేషణ జీవనయానంలో ముందుకు అడుగులు పడేకొద్దీ చలం జీవితం మహాప్రస్థానంగా సాగిపోయింది.

రమణాశ్రమ పవిత్ర సన్నిధిలో : 1979 మేలో తుదిశ్వాస విడిచేవరకు చలం జీవనయానం సుమారు 53 ఏళ్ళు తెలుగునాట, 27 ఏళ్ళు అరుణాచలేశ్వరుని దివ్యసన్నిధి రమణాశ్రమంలో గడిచింది. 1920 దశకంలో శశిరేఖ తొలి నవలగా, 1930–40 మధ్య అరుణ, బ్రాహ్మణీకం, జీవితాదర్శం, మ్యూజింగ్స్, స్త్రీ, దైవమిచ్చిన భార్య, ప్రేమలేఖలు, బుజ్జిగాడు, పురూరవ ఇలా ఎన్నో రచనలు చలం సాహిత్యం ఆధునిక యుగాన్ని ఆవిష్కరింపచేసింది. పూర్వాశ్రమంలోను, రమణాశ్రమంనుంచి దశాబ్దాల తరబడి రచనలతోపాటు మిత్రులకు, అభిమానులకు వ్రాసిన లేఖలలో ఆత్మీయ స్పర్శ, హృదయార్ద్రత పలకరిస్తుంటాయి. అనిర్వచనీయమైన ప్రేమ, నిష్కాపట్యం, నిర్మొహమాటం, హాస్యపుజల్లులు, వేదాయుల స్పందనలు తెలుగు సారస్వతానికి నూతన అలంకారాలుగా విలసిల్లుతున్నాయి. తనకోసం కాకుండా అపరిచితుల, అభిమానుల సంతోషపెట్టడానికి, వారి లేత, అజ్ఞాన భావాల పలకరింపుగా మురిపించటానికి లేదా జాలిపడి ప్రత్యుత్తరాలు వ్రాశారు. వ్యక్తిత్వం, దస్తూరీ, రసికత, ఆప్యాయత, మెరుపు చురకల్లాంటి తేటమాటలు, పసిపిల్లవాని హృదయం ఆ లేఖలలో స్పష్టమవుతోంది. ఆయన అభిమానిగా 1969–74 మధ్య ఐదు జాబులు అదుకొనే ధన్యత ఈ వ్యాస రచయితకు దక్కింది. 'భగవాన్నించి నేను అవలోకించిన దివ్యానుభూతి నాకే చాలకుండా ఉంది. మీకెక్కడ పంపగలను;' అని వ్రాస్తూ 'అప్పుడే కాదు' అన్నారు. ఈశ్వర కరుణ, ఆదరణ, ఆశీర్వాదాలతో చలం పలకరింపులు నేటికీ చలింపచేస్తున్నాయి.

తెలుగు ఉద్యమాన్ని బలపరుద్దాం

– పారుపల్లి కోదండరామయ్య

ఒక తెలుగు నవల రాస్తే – పద్యం, గేయం, కవిత, నాటకం, శతకం రాస్తే తెలుగు సేవ చేసినట్లేనని ఎక్కువమంది అనుకుంటున్నారు. అటువంటి వారిని గుర్తించి సన్మానిస్తే చాలు అనే అభిప్రాయం ఉంది. మనకు పట్టిన జబ్బు ఆ స్థాయిని దాటిపోయింది. సాహిత్య సేవ వద్దు అనం కాని అది ఏమాత్రం చాలదు అని అందరి దృష్టికి ఉద్యమకారులు తీసుకురావాలి. ఒక విధంగా సాహిత్య కార్యక్రమాలు తెలుగు ప్రేమికులకు నల్లమందుగ పనిచేసి అసలు పనిలోకి దిగకుండ అడ్డుకుంటున్నాయి అని కూడా మనలో కొంతమంది అంటున్నారు. అమ్మనుడి విషయమై మనం పెద్ద ఎత్తున కదలకపోతే రాజకీయ నాయకులు, మంత్రులు ఈ సంగతిని పట్టించుకోరు. ఉద్యమకారులు సభలు పెట్టుకొని చలువగదుల్లో కూర్చొని ప్రభుత్వాలు ఈ పని చేయాలి, ఆ సంఘాన్ని వేయాలి అని తీర్మానాలు చేస్తే సరిపోతుంది అనే భ్రమలో ఉన్నాం.

ఈ మధ్య సంఘటన మనకు కనువిప్పు కలిగించాలి. అత్యున్నత న్యాయస్థానం గొడ్లమీద ప్రేమతో 'జల్లికట్టు' నిషేధిస్తున్నాం అని తీర్పు ఇచ్చింది. లక్షలమంది తమిళులు రోడ్డునపడి 'మేము జల్లికట్టు ఆడతాం. మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి' అంటే న్యాయస్థానం మిన్నకుండిపోయింది. మంది తలచుకుంటే మన సంస్కృతి నిలబడుతుంది. ఇప్పటికీ మనం కదలకపోతే తెలుగు తల్లిమీద మనకు నిజంగా అభిమానం లేనట్లే. మీ ఊళ్ళో మీరు ఒక్కరిగానో, ఇద్దరిగానో ఉంటే ఇంకొక పదిమందిని తెలుగు తల్లి సేవకు ముందుకు వచ్చేట్లు ఒప్పించాలి. తెలుగు దండును ఏర్పరచాలి. అది రామదండులా పనిచేయాలి.

1. తెలుగుదండు ప్రతినెల మొదటి సెలవునాడో, చివరి సెలవునాడో ముందే నిర్ణయించుకున్న దినాన తప్పక కలవాలి. జరిగిన పనిమీద సమీక్ష ఉండాలి. కొత్త పనులకు ప్రణాళిక వేయాలి. ప్రతి సభ్యుడు ప్రతి నెల ముఖ్యమంత్రి, భాషా మంత్రికి తెలుగుకోసం చేయాల్సిన పనులను వక్కాణిస్తూ పోస్ట్‌కార్డును రాయాలి. ఇ మెయిల్, ఛేంజ్.ఆర్గ్, ముఖ్యమంత్రి డాష్ బోర్డులను కూడా ఇందుకు వాడాలి.

2. తల్లిదండ్రులు తమ పిల్లలు ఆంగ్లమాధ్యమంలో చదవాలి అని కోరుకుంటున్నారు. అందుకని మేము కూడ ఆంగ్లమాధ్యమం బడులను పెట్టవలసి వస్తున్నది అని ప్రభుత్వం అంటున్నది. అందుకని మనం వీలైనంతమంది తల్లిదండ్రులను కలవాలి. తెలుగులో చదివితేనే పిల్లలు రాణిస్తారన్న విషయాన్ని వారికి తెలిసేటట్లు చెప్పాలి. బడులలో పెట్టే తల్లుల సమావేశాలకు మనమూ వెళ్ళాలి. తల్లులకు నచ్చచెప్పాలి.

3. అన్ని పేరు పలకలలో తెలుగు ప్రముఖంగా ఉండాలని రెండు ప్రభుత్వాలు స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చాయి. అలా లేనిచోట మనము అంగడి యజమానిని కలిసి చెప్పాలి. మన సంస్కృతిని చంపాలని అనుకునే ఆ కొట్టును బహిష్కరించమని వాడకందారులను కోరాలి. తెలుగు లేని పేరుపలక ఫొటోను తీసి సంబంధిత అధికారికి ఫిర్యాదును ఇచ్చి రసీదు తీసుకోవాలి. అతను చర్య తీసుకోకుంటే, పై అధికారికి, అవినీతి నిరోధక శాఖకు అతనిపై ఫిర్యాదును ఇవ్వాలి.

4. ఆంధ్రాబ్యాంకు శాఖకు వెళ్లాలి. శాఖాధికారికి చెప్పాలి. ' ఉత్తరాదిని హిందీలో ఇస్తారు, మంగుళూరులో కన్నడంలో ఇస్తారు. మధురైలో తమిళంలో ఇస్తారు, నీకేం రోగం వచ్చింది? ఆంధ్రబ్యాంక్ అని పేరుపెట్టుకొని ఆంధ్రదేశంలో ఉండి తెలుగులో ఒక్క కాగితం కూడా ఇవ్వటం లేదేమి? వారంరోజుల్లో కాగితాలు తెలుగులో ఉండకపోతే గేటుకు అడ్డంగా నిలబడి ఆంధ్ర ద్రోహులకు మీరు దూరంగా ఉండమని వాడుకదారులను అడిగి మీ శాఖ మూతబడేట్లు చేస్తాం' ఇలా పదిచోట్ల జనం కదిలితే పరిస్థితిలో మార్పురాదా? అలానే మిగిలిన బ్యాంకులు కూడా.

5. రోడ్ రవాణా సంస్థ, విద్యుత్ కార్యాలయాలకు వెళ్ళాలి. ప్రభుత్వ ఆదేశం 218 తే.22-3-1990 మేరకు మీ రాతపోతలన్నీ తెలుగులోనే ఉండాలి. పెద్దగా చదువురాని డ్రైవర్‌కు, హెల్పర్‌కు మీరు ట్రాన్స్‌ఫర్ లేక పని ఆదేశాలను ఆంగ్లంలో ఎందుకు ఇస్తున్నారు? అని అడగాలి. చట్టరీత్యా ఇది క్రిమినల్ పని. మీ మీద కేసు పెట్టమంటారా?

6. మన ప్రాంతానికి వస్తున్న అధికారులు, సంఘాల, సంస్థల నాయకులు, ప్రసంగీకులు, అధికార, ప్రతిపక్ష నాయకులను కలవాలి. తెలుగు వాడకం మీద ఒప్పించి వారి ప్రకటన కాగితాలను తీసుకోవాలి. వాటిని ప్రసార మాధ్యమాలకు ఇవ్వాలి.

7. ఉద్యమంలోనికి నిరంతరం కొత్తవారిని చేర్చటం అనే కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే ఉండాలి.

8. ప్రతి సాహిత్య సమావేశానికి వెళ్ళి చివరగా తెలుగుకోసం ప్రభుత్వం చేయవలసిన పనులను వివరిస్తూ ఒక తీర్మానాన్ని అందుకోసం చేయించాలి. ఉద్యమ నినాదాలివ్వాలి. సంతకాలు పెట్టించి ప్రభుత్వానికి, పత్రికలకు పంపాలి. వట్టి సాహిత్యానికే పరిమితం అయితే తెలుగు ప్రేమికులకు భ్రమ కలిగించి – కొంతమంది అంటున్నట్లు మత్తుమందుగ పనిచేసి – ఉద్యమ బాటనుంచి పక్కబాట పట్టిస్తుంది.

9. రచయితలను కలవాలి. 'మీరు రాసిన పుస్తకం ఎవరూ – మీ మనవడితో సహా – చదువరు అని మీకు తెలుసు. అందుకనే 500 ప్రతులనే వేస్తున్నారు. 50 ప్రతులను మీకు తెలిసినవారికి ఊరికనే ఇస్తారు. మిగిలిన 450 మీరు ఉన్నంతకాలం మీ ఇంట్లో ఉంటాయి. వాటిని దులపలేక, సర్దలేక పెండ్లం మిమ్ములను తిడుతూనే ఉంటుంది. తెలుగువారు 18 కోట్లమంది ఉన్నా మనకు ఈ గతి పట్టింది. కాని 3 కోట్లమందే ఉన్న మలయాళీలు ప్రతిరచయిత 10,000 ప్రతులకు తక్కువ వేయకుండా చూస్తారు. వాటిని కొంటారు. అందుకని మీరుకూడ కొంతకాలం కలాన్ని పక్కనపెట్టి కాలు జాడించి ఉద్యమంలోకి కదలాలి' అని చెప్పాలి.

10. ముందు మనం మారాలి. మారిన మనిషిగ కుటుంబంలోని

మిగిలిన వారికి, మన నేస్తాలకు, తెలిసినవారికి చాల స్పష్టంగ కనబడాలి. మనం మాట్లాడేటప్పుడు వీలున్నంత వరకు తెలుగు మాటలనే వాడాలి. ఇంగ్లీష్, సంస్కృతం, హిందీ పెరనుడుల మాటలను క్రమంగ వదిలెయ్యాలి. తెలుగు పరిపుష్టమైన భాషే అన్న అభిప్రాయాన్ని మనం పెంపొందించాలి. సమావేశాలలో, కార్యాలయాలలో, ఇతరచోట్ల మన పేరు, చిరునామాలను తెలుగు లోనే రాయాలి. అన్నిచోట్ల-బ్యాంకులు సహా-మీ సంతకాలను తెలుగులోనే పెట్టాలి. మీ చేపలుకి అంకెను తెలుగులోనే చెప్పాలి.

11. వాట్సాప్, టెలిగ్రామ్, ఇమెయిల్, ఫేస్ బుక్, ట్విట్టర్‌లాంటి కొత్త సాంఘిక మాధ్యమాల్లో చురుకుగా పాల్గొని ఉద్యమ సందేశాన్ని పెద్దగ ప్రచారం చేయాలి.

12. విశ్వవిద్యాలయాలు, కళాశాలలు అధికారులను కలవాలి.

13. ప్రతి పల్లెటూరులోను తెలుగు పంతుళ్ళు ఉన్నారు. అంటే సహజంగానే మారుమూల ప్రాంతాల్లో కూడా మన సైనికులు ఉన్నారు. మన ఉద్యమానికి మిగిలిన కార్యకర్తలకి కేంద్ర బిందువుగ వీరిని కదిలించాలి. బదులలో తెలుగుపోతే వారా జాతే అంతరించి పోతుంది అన్న విషయాన్ని వారికి వివరించాలి.

14. పత్రికలలో మన వ్యాసాలు, ఉత్తరాలు క్రమం తప్పకుండా కనబడాలి. తెలుగు తల్లికోసం సమాజం గళమెత్తింది అన్న సందేశం స్పష్టంగ కనబడాలి.

15. తెలుగును పెంపొందించాలి అన్న మంచి ఆశయంతో చాల సంస్థలు తాము ఎన్నుకొన్న సందర్భాలలో కవితలు, కతలు, నవలలు వగైరా పోటీలు పెడుతుంటారు. భాషోద్యమం పోటీలవైపు మారాల్సిన అవసరాన్ని వారికి తెలియజేయాలి.

16. ముందుగ తెలుగును ఒక విషయంగ కూడ చెప్పని బదుల మీద ఫిర్యాదు చేయాలి. వ్యాజ్యాలు వేయాలి.

17. ఉత్తేజపరచి, ఉరికించే ఉద్యమ నినాదాలను తయారు చేయాలి. పాటలు రాయాలి. పాడించి సాంఘిక మాధ్యమాలలో పెద్దగ ప్రచారానికి పెట్టాలి.

18. పత్రికలు, టి.వి., సినిమా బాధ్యులను కలవాలి. తెలుగుతో పాటు వారి బ్రతుకుతెరువు కూడా ఇబ్బందులలో పడుతుంది అన్న సంగతి వారికి గుర్తు చేయాలి. సరైన తెలుగును వాడి మిగిలిన వారికి మంచి దారిని చూపించాలని కోరాలి. ఉద్యమ వార్తలు, వ్యాసాలకు ప్రాముఖ్యతను ఇవ్వాలి అని చెప్పాలి.

19. రాజకీయ నాయకులను, అందునా ప్రతిపక్ష నాయకులను కూడ తప్పక కలవాలి. అన్ని పార్టీలవారు మన ఉద్యమాన్ని సమర్థిస్తేనే అడ్డంకులు తగ్గిపోతాయి.

20. మన కోర్కెలలో చాలవాటిని అమలు చేయడానికి ప్రభుత్వానికి అయ్యే అదనపు ఖర్చు కూడ ఉండదు. ఈ విషయాన్ని వారి దృష్టికి తెచ్చి ముందుగ వాటిని అమలు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి అని తెలపాలి.

21. జిల్లాలో న్యాయమూర్తిని కలిసి మీరే చట్టాలకి వ్యతిరేకంగా పనిచేస్తే ఎలా అని అడగాలి. తీర్పులు, పాలన తెలుగులోనే ఉండాలని ఉన్న స్పష్టమైన ఆదేశాలను ఎందుకు పాటించటం లేదు అని అడగాలి. 170 ఏండ్ల క్రితమే బ్రౌన్ దొర తెలుగులో తీర్పులు ఇచ్చాడు.

22. ముందు మన మనస్సుల్లో స్పష్టత ఉండాలి. కోరికలు, తీర్మానాలు, మహజర్ల దశనుంచి మనం రోడ్డుమీదకు రావాలి.

23. మన పిల్లలకు తెలుగు ఆటలు, పాటలు, కళలు నేర్పాలి. మన కార్యక్రమాలలో అవి కనబడాలి.

దేవుని లెక్క

ఇద్దరు బాటసారులు దారిలో గుడి అరుగుమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇంతలో అక్కడికి ఒక వ్యక్తి వచ్చి ఆగాడు. ముగ్గురూ కూర్చుని కబుర్లలోపడ్డారు. ఇంతలో గాలి,వాన వాళ్ళు అక్కడినుంచి కదలలేకపోయారు. భోజనంవేళ అయింది. ఆకలికూడా మొదలయ్యింది. ఒకడు 'నాదగ్గర మూడు రొట్టెలున్నాయి, నా మిత్రుని దగ్గర ఐదు రొట్టెలు ఉన్నాయి. వాటిని ముగ్గురం పంచుకుని తిందాం' అన్నాడు. కాని ఇప్పుడు వాళ్ళకి ఒక సమస్య ఎదురైంది. ఆ ఎనిమిది రొట్టెల్ని ముగ్గురు సమానంగా పంచుకుని తినాలి, ఎలాగ?


దానికి మూడో వ్యక్తి ఒక ఉపాయం చెప్పాడు. 'మనం ఒక్కొక్క రొట్టెని మూడు మూడు ముక్కలు చేద్దాం. అప్పుడు అవి 24 ముక్కలవుతాయి కదా! సమానంగా పంచుకుని తినేద్దాం' అన్నాడు. ఇది ముగ్గురికి సబబుగానే తోచింది. దానితో వాళ్ళు 24 ముక్కలు చేసి సమానంగా 8 చొప్పున అందరూ సమానంగా ఆ రొట్టెలను తిని ఆ రాత్రికి అక్కడే హాయిగా నిద్రపోయారు.

తెల్లవారి లేచి ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోతుండగా మూడో వ్యక్తి 'మీకు నా కృతజ్ఞతలు తెల్పుకుంటున్నాను. నా దగ్గర ఎనిమిది రూపాయలు ఉన్నాయి. ఇవి మీ ఇద్దరు తీసుకోండి' అని వాళ్ళకి ఇచ్చి వెళ్ళిపోతాడు.

సరే, ఆ ఇద్దరు కూడా చెరోదారిని వెళ్ళబోతూ రెండోవాడు 'నా నాలుగు రూపాయలు నాకిస్తే నే వెళ్ళిపోతాను' అన్నాడు. 'అలా ఎలాగ? నీవి మూడురొట్టెలే కనుక నీకు మూడు, నావి ఐదు రొట్టెలు కనుక నాకు ఐదు అన్నాడు'. ఇలా వాళ్ళమధ్య వివాదం పెరిగింది. చిక్కు తీర్చుకోడానికి వాళ్ళు న్యాయాధికారి దగ్గరకు వెళ్ళారు. అతనికి ఏం న్యాయం చెప్పాలో తోచలేదు. న్యాయం రేపు చెబుతాను ఆ సొమ్ము ఇక్కడపెట్టి రేపు రండి' అని పంపించేశాడు.

ఆ రాత్రి దేవుడు న్యాయాధికారికి కనబడి 'రేపు న్యాయం ఏం చెబుతావు?' అని అడిగాడు. 'ఐదు రొట్టెలవాడికి ఐదు రూపాయలే న్యాయంగా కనబడుతోంది' అనుకుంటున్నానన్నాడు. 'కాదు. మూడు రొట్టెలవాడు తన రొట్టెల్ని తొమ్మిది ముక్కలుగా చేశాడు. ఐదు రొట్టెలవాడు పదిహేను ముక్కలు చేశాడు. అవునా! ఇపుడు మూడు రొట్టెలవాడు తన తొమ్మిదిలో ఎనిమిది తానే తినేశాడు. అంటే వాడు ఒక్కటే పెట్టాడు. ఇక రెండోవాడు ఏడు ముక్కలు పెట్టాడు. కాబట్టి వాడికి ఏడు రూపాయలు చెల్లాలి. ఇదే న్యాయం' అన్నాడు. మరునాడు అలాగే తీర్పు చెప్పేశాడు.

RNI. NO.: APTEL 2009/30947 POSTAL REG NO. : H/RMY/79/2019-21,
EDITED, PRINTED AND PUBLISHED BY DR. BVS MURTY, 102, MOONLIGHTS, J.N. ROAD, RAJAHMUNDRY - 3
If underlivered please return to
SRIKALAGOWTAMI
102, MOONLIGHTS, J.N. ROAD, RAJAHMUNDRY - 3,
EAST GODAVARI DISTRICT, A.P.



శ్రీ కవితా ప్రసాద్ రచన

శ్రీరాజశేఖర శతకము

పేజీలు 12+28 వెల అమూల్యం
ప్రతులకు : కవితా ప్రసాద్
రాజమహేంద్రవరం
94901 68907


శ్రీ ప్రసాద్‌గారు సంప్రదాయ కుటుంబంలో జన్మించిన శ్రోత్రియుడు. ఓ.యన్.జి.సి.లో చిరకాలం దేశం నలుచెఱగులా పనిచేసి పదవీ విరమణ చేశారు. తండ్రి 'దైవజ్ఞరత్న' కామేశ్వర శర్మగారు వాస్తు, జ్యోతిష పండితులు. వీరి స్వస్థలం అవనిగడ్డ. జన్మస్థలంలోని దేవాలయం రాజరాజేశ్వరీ సమేత రాజశేఖర స్వామివారు. ఎవరో తెలియని వయసునుంచి ఎవరో తెలుసుకోలేని వయసువరకు అక్కడే పెరిగారు. ఇంటిపేరు 'కవిత' కావడంతో వారిలో అంతర్లీనంగా కవిత్వాభిరుచి పుట్టుకతోనే పుట్టింది. 5వ తరగతినుండే కవిత్వం వ్రాయడం అలవడింది. సహధ్యాయి శ్రీ మృత్యుంజయరావుగారి ప్రోత్సాహంతో అప్పుడప్పుడు వ్రాసిన 128 పద్యాలతో ఈ శతకం పూర్తి చేశానంటారు కవి.

'నేను నాయంతవాడను, గాను వేఱు – నాదు శతకము స్వామికి నచ్చు నచ్చ కుండు టస్మదీయాదృష్టముండు నంతె–అతిశయోక్తులాడగను స్వామి తెలియండా' ఎప్పుడో అప్పుడు కలియకపోతామా! అప్పుడు ఆయనే చెప్తాడంటారు.

శ్రీ కవితా ప్రసాద్‌గారికి పద్య,వచన కవిత్వములు, కథారచన, జ్యోతిషం, వాస్తు, ముహూర్త శాస్త్రములపట్ల అభిరుచి, అభినివేశం ఉన్నాయి. వాటితోపాటు సంగీతం, మంత్రశాస్త్రం, వేదాంతం, ఆధ్యాత్మికత అభిమానాంశాలు. ఈయన పలు పత్రికలలో కథలు, కవితలు, వ్యాసాలు వ్రాయడమే కాదు పలు మార్లు బహుమతులు అందుకున్నారు.

వీరికిగల బహుముఖ ప్రజ్ఞా ప్రాభవానికి వీరి శతకమే ఆధారం. 'అహమును వీడుమందురు . . .' పద్యంలో వీరి మంత్రశాస్త్ర పరిచయం, 'నీవరి ముల్లు సామ్యమున . . .' శ్రుత్యర్థం, 'తీరొక రీతి నుండదు మదీయ మనోగతి . . .' ఆధ్యాత్మికత, 'మోహము వీడు టొండెకద ముక్తికి మార్గము . . .' మనస్సంకల్పం, 'మరి పునర్భవమ్ము నెంతమాత్ర మీహ లేదు . . .' జన్మరాహిత్యం కోరుకోవడం వీరికిగల ఆధ్యాత్మిక ఔన్నత్యానికి నిదర్శనం.

అంతేకాదు ఈ శతకంలో చిల్లిచెంబు, రుద్రాక్షపిల్లి వంటి నుడికారములు పాఠకుల నాకర్షిస్తాయి. ధారాశుద్ధి, అనాయాస యతిప్రాసలకూర్పు, భావ వైశిద్యం, పదాలంకార ప్రయోగ కౌశల్యం ఈ శతకానికి వన్నె తెచ్చాయి. సాహితీప్రియుల నలరించే శతకంలో ప్రతి పద్యం దానికదే సామ్యం. తప్పక చదవండి–చదివించండి. చదివినవారికి అమ్మ,అయ్యల అనుగ్రహం కలగాలని కవి కోరిక.



శ్రీ పారుపల్లి కోదండరామయ్య రచన

తెలుగే గొప్ప భాష
కాని కనుమరుగౌతున్నది

పేజీలు : 128 మూల్యం : 65/-
ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ

ఒక జాతి భాష నిలబడాలంటే అది ప్రజల వాడుకలో నిలబడాలి. ఎప్పుడయితే వాడుకలోంచి భాష తప్పుకుంటుందో అప్పుడే భాషకు పతనావస్థ ప్రారంభమవుతుంది. భాష ఒక్కటే పోదు. తనతోపాటు భాషా సాహిత్యాన్ని, సంస్కృతిని, సంప్రదాయాన్ని అన్నింటినీ సునామీలా తుడిచిపెట్టేస్తుంది. ఇపుడు భారతీయ భాషలకు ఆ ప్రమాదం ముంచుకొచ్చింది. అందునా తెలుగు భాషకు విపరీతంగా వచ్చింది. తెలుగు నానాటికి నీరసపడుతోంది. ఈవేళ తెలుగు సినిమా పోస్టర్లుకూడా ఇంగ్లీషులో కూడా వ్రాయవలసిన స్థితికి వచ్చాం. ఇప్పటికే సామాన్యుడు కూడా తన సంతానాన్ని తెలుగులో మాట్లాడొద్దని చెప్పే స్థితికి ఎదిగేం మనం.

ఈ స్థితిలో తెలుగు భాషకు పూర్వవైభవం తేవాలనే తపనతో ఒక వ్యక్తి తాను తెలుగు చదువుకోకపోయినా, తెలుగు వాడైనందున ఆ భాషకోసం తన శక్తియుక్తులను వినియోగించ పూనుకొనడం నిజంగా తెలుగు వారందరూ అభినందించవలసిన విషయం. కరెంటు శాఖలో 40 ఏళ్ళు ఇంజనీరుగ పనిచేసి, విశేష అనుభవాన్ని గడించిన కోదండ రామయ్యగారు తెలుగుకు దీప్తిని తేవాలని కృషి సల్పడం తెలుగుజాతి అదృష్టంగా భావించాలి.

భాషా ప్రేమికులకు సన్నిహితుడై, భాషాద్రోహులకు ఏకుమేకై నిరంతరం పట్టువదలని విక్రమార్కుడిలా పోరాడుతున్న శ్రామికుడు పారుపల్లివారు. తెలుగులోని అందచందాలను మనం ఏవిధంగ పోగొట్టుకుంటున్నామో ఇందులో సోదాహరణంగా నిరూపించారు. భాషను లోతుగా పరిశీలిస్తేకాని, పరిశోధిస్తేకాని ఇంత విపులంగా వివరణ ఇవ్వడం సాధ్యం కాదు. ఒక భాషా శాస్త్రవేత్త చేయవలసిన పనిని తాను సాధికారంగా చేసి ఇందులో చూపించడం జరిగింది.

అక్కడక్కడ భాషా ప్రేమికులు భాషగురించి ఆలోచిస్తున్నా సంఘటితంగా కృషి చేయనిదే ఫలితం రాబట్టడం కష్టం. ఇపుడు రాష్ట్రంలో క్రొత్త ప్రభుత్వం ఏర్పడింది కనుక ఇపుడైనా తెలుగు భాష పునర్వైభవంకోసం అందరూ ఏకకంఠంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇంగ్లీషు మనం వద్దనడం లేదు. తెలుగును చంపవద్దంటున్నాం. ఈ నిప్పురవ్వలు అందరి గుండెల్లో ప్రజ్వరిల్లితే, ముంచుకొస్తున్న ప్రమాదం గుర్తెరిగితే, రచయిత కృషిగ ఆ ప్రచండ జ్వాల అమ్మనుడిని కాపాడుతుంది. తప్పక చదవండి.